## లక్నోలో ఘోర అగ్నిప్రమాదం.. భవనంపై నుంచి దూకిన విద్యార్థులు

ఢిల్లీ: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలిగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ కమ్ గేమింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందింది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. విద్యాబోధనతో పాటు గేమింగ్ జోన్ కూడా నిర్వహిస్తున్న ఈ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా విస్తరించాయి. దట్టమైన పొగ, అగ్నికీలలు భవనాన్ని చుట్టుముట్టడంతో లోపల ఉన్నవారు చిక్కుకుపోయారు. ప్రాణాలు కాపాడుకునే క్రమంలో కొందరు విద్యార్థులు భవనం మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం, పోలీసు యంత్రాంగం వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం సేవలు అందించాలని, బాధితులకు అవసరమైన అన్ని విధాలా అండగా నిలవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది కూలింగ్ ఆపరేషన్స్‌తో పాటు, భవనంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అనే అంశంపై గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తునకు అధికారులు ఆదేశించారు. భద్రతా నిబంధనల ఉల్లంఘన ఏమైనా జరిగిందా అనే కోణంలోనూ విచారణ చేపట్టనున్నారు.

## బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం.. ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

ఢిల్లీ: బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

## ఏనుగు పేడతో కాఫీ.. ఒక్క కప్పు ధర రూ.4,700!

ఢిల్లీ: కాఫీ అంటే చాలా మందికి ఇష్టం. ఉదయం ఓ కప్పు కాఫీతో రోజును ప్రారంభించే వాళ్లు కోట్లలో ఉంటారు. కానీ ఒక కప్పు కాఫీ ధర రూ.4,700 దాటితే? అదీ ఏనుగు పేడ నుంచి సేకరించిన గింజలతో తయారైతే? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఇదే ప్రపంచంలో అత్యంత అరుదైన, ఖరీదైన కాఫీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

ఏంటీ బ్లాక్ ఐవరీ కాఫీ?.. థాయ్‌లాండ్‌లో తయారయ్యే 'బ్లాక్ ఐవరీ కాఫీ' ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాఫీ రకాలలో ఒకటి. దీని ధర కిలోకు దాదాపు 2,000 డాలర్ల వరకు ఉంటుంది. ఒక్క కప్పు కాఫీ ధరే సుమారు 50 డాలర్లు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.4,700కు పైమాటే. ఈ కాఫీ ప్రత్యేకత ఏంటంటే... గింజలను ఏనుగుల జీర్ణవ్యవస్థ ద్వారా ప్రాసెస్ చేస్తారు.

తయారీ విధానం ఇదే

కాఫీ గింజలను బియ్యం, అరటిపండ్లు, ఇతర పండ్లతో కలిపి ఏనుగులకు ఆహారంగా ఇస్తారు. ఆహారం జీర్ణమయ్యే సమయంలో కాఫీ గింజలు కూడా ప్రత్యేక ప్రక్రియకు లోనవుతాయి. 15 నుంచి 17 గంటల తర్వాత ఏనుగుల మల విసర్జన నుంచి ఆ గింజలను సేకరించి శుభ్రపరుస్తారు. అనంతరం వాటిని ప్రాసెస్ చేసి కాఫీ తయారు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల కాఫీకి ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తుందని కాఫీ ప్రియులు చెబుతున్నారు.

అంత ఖరీదెందుకు?....

ఈ కాఫీ తయారీ ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతుంది. గింజల సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు ప్రతి దశలో అధిక శ్రమ అవసరం. అలాగే ఉత్పత్తి పరిమితంగా ఉండటం కూడా ధర పెరగడానికి కారణం. కాఫీలో చాక్లెట్, నట్స్, మట్టి వాసనల మిశ్రమ రుచి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఏనుగుల ఆరోగ్యానికి హాని కలగకుండా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామని తయారీ సంస్థలు పేర్కొంటున్నాయి.

## కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం.. అప్రమత్తంగా ఉండాలి

అమరావతి: రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని.. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. వివిధ ఘటనలకు కులమతాల రంగు పులుముతున్నారని.. వాటిని వివాదాస్పద అంశాలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీజీఎస్‌పై సమీక్షలో భాగంగా సీఎం మాట్లాడారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు అన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారని వ్యాఖ్యానించారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని చెప్పారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. తప్పుచేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంచ్ చేసేలోపు క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు.

## డీటీవో వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశం

హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విధి నిర్వహణలో ఉండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి (ఇఛా) ఎం. వెంకన్న ఘోర మరణం చెందిన ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని రవాణాశాఖ జాయింట్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై వీలైనంత త్వరగా పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది. వెంకన్న మృతి పట్ల సంతాపం ప్రకటించిన సీఎం.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన డీటీఓ వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామన్నారు. ప్రమాదం వివరాల్లోకి వెళితే... ఈ ఉదయం గణపురం మండలం చెల్పూరు శివారులో వాహనాలను తనిఖీలు చేస్తుండగా బొగ్గు లోడ్‌తో వెళుతున్న టిప్పర్ లారీ వెంకన్నపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

## అక్రమాలను అడ్డుకుంటే లారీలతో తొక్కించి చంపేస్తారా? అని ప్రశ్నించిన హరీశ్

హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వాహనాల తనిఖీలు చేస్తుండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి (ఇఛా) వెంకన్న దుర్మరణం చెందిన ఘటన ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ ఘోర ప్రమాదంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ రోడ్డు ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మరణం కేవలం ఒక యాక్సిడెంట్ మాత్రమే కాదనే బలమైన సందేహాన్ని హరీశ్‌రావు లేవనెత్తారు. "రాష్ట్రంలో అధికారులను బెదిరిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫియాల ఆటలు మితిమీరిపోయాయి. నిజాయతీగా పనిచేసే అధికారులు వారి అక్రమాలకు అడ్డొస్తే... ఇలా లారీలతో తొక్కించి ప్రాణాలు తీస్తారా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. భూపాలపల్లి ఏరియాలో సాగుతున్న అక్రమ ఇసుక, బొగ్గు రవాణా వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరు? వారికి సహకరిస్తున్న లీడర్స్ ఎవరు? అనే పూర్తి వివరాలను ప్రభుత్వం తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వెంకన్న ప్రమాదం వెనుక దాగిన నిజాన్ని పూర్తిగా వెలికితీయాల్సిన బాధ్యత ముమ్మాటికీ రాష్ట్ర సర్కార్ పైనే ఉందన్నారు. కేవలం డ్రైవర్‌ను అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటే కుదరదని... ఈ కేసుపై ఒక ఉన్నత స్థాయి సమగ్ర విచారణ జరిపించి, దీని వెనుక ఎవరి ప్రేరేపణ అయినా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేయాలన్నారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించడంతో పాటు, భవిష్యత్తులో విధుల్లో ఉండే అధికారులకు ఇలాంటి దారుణాలు జరగకుండా పకడ్బందీ రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## రాజ్‌నాథ్ సింగ్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

మొదటి పేజి తరువాయి

రాజ్‌నాథ్ సింగ్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్ర మంత్రి గారికి తెలియజేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న విమానాశ్రయం దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. భారత వాయు సేన టెర్మినల్‌తోపాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సదుపాయాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున, ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో / డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారు కేంద్ర మంత్రి గారిని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం

మొదటి పేజి తరువాయి

"ఉద్యోగులు వినూత్నంగా ఆలోచనలు చేసేలా ప్రోత్సహిస్తాం. పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తాం. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి. దీని ద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుంది. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉద్యోగులు పాలనా పరంగా సామర్థ్యాలను పెంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పని విధానం మార్చుకోవాలి. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాం. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యమివ్వాలి. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరం. పాలనలో సంస్కరణలపై ఉద్యోగులకు, అధికారులకు శిక్షణ ఇప్పించాం. పాత రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్ గా ఉండేది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సులభంగా వాటిని క్లియర్ చేయగలిగే పరిస్థితి ఉంది. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయి."అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

పాత కేసుల ట్రేసింగ్

"రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయి. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను, అధికారులను బద్నాం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంత మంది నేరాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారు. పాత కేసులను పరిష్కరిస్తున్నాం. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారు. శిక్షలు కూడా పడుతున్నాయి. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను పక్కాగా పాటించాలి. ప్రమాణాల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంఛ్ చేయాల్సి ఉంది. ఈలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, నదీ జలాలను కాలుష్యం నుంచి కాపాడడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్‌కు అమెరికా భారీ రక్షణ బూస్ట్.. రూ.3,700 కోట్ల ప్యాకేజీకి ఆమోదం

మొదటి పేజి తరువాయి

మొత్తం 428.2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.3,700 కోట్లు) విలువైన ఈ ప్యాకేజీలు భారత ఆర్టిలరీ, వైమానిక దళాల నిర్వహణ సామర్థ్యాలను పెంచనున్నాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ కీలక భాగస్వామి అని అమెరికా మరోసారి స్పష్టం చేసింది. అమెరికా రక్షణ భద్రతా సహకార సంస్థ (డీఎస్‌సీఏ) ఈ ప్రతిపాదనలను అక్కడి కాంగ్రెస్‌కు పంపించింది. ఇందులో కొత్త ఆయుధాల కొనుగోలు ప్రస్తావన లేదు. ఇప్పటికే భారత సైన్యంలో ఉన్న ఎం777ఏ2 అల్ట్రా లైట్ హోవిట్జర్లు, ఏహెచ్-64ఈ అపాచీ హెలికాప్టర్ల నిర్వహణ, విడిభాగాలు, సాంకేతిక సాయం, శిక్షణ వంటి అంశాలను మాత్రమే చేర్చారు. అత్యధికంగా 230 మిలియన్ డాలర్ల విలువైన ప్యాకేజీ ఎం777ఏ2 హోవిట్జర్ల కోసం కేటాయించారు. ఇందులో విడిభాగాలు, మరమ్మతులు, సాంకేతిక సేవలు, శిక్షణ, ఫీల్డ్ సపోర్ట్, లాజిస్టిక్స్ సేవలు ఉన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో వేగంగా మోహరించగల ఈ హోవిట్జర్లు భారత సైన్యానికి ఇప్పటికే కీలక ఆయుధాలుగా మారాయి. వాటి పనితీరును మరింత మెరుగుపరచడమే ఈ ప్యాకేజీ ప్రధాన లక్ష్యం. మరో 198.2 మిలియన్ డాలర్ల ప్యాకేజీ అపాచీ దాడి హెలికాప్టర్ల కోసం మంజూరైంది. ఇందులో ఇంజినీరింగ్ సేవలు, సాంకేతిక మద్దతు, శిక్షణ, లాజిస్టిక్స్ సాయం, అవసరమైన సాంకేతిక డేటా అందించనున్నారు. యుద్ధ పరిస్థితుల్లో కీలక పాత్ర పోషించే అపాచీ హెలికాప్టర్ల సామర్థ్యాన్ని నిలబెట్టుకోవడంలో ఈ మద్దతు ఉపయోగపడనుంది. ఈ ఒప్పందాలపై అమెరికా రక్షణ శాఖ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక అభివృద్ధికి భారత్ ప్రధాన శక్తిగా నిలుస్తోందని పేర్కొంది. ప్రస్తుత, భవిష్యత్ భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్‌కు ఈ మద్దతు ఉపయోగపడుతుందని వెల్లడించింది. ప్రాంతీయ ముప్పులను నిరోధించే సామర్థ్యం కూడా మరింత పెరుగుతుందని తెలిపింది. గత రెండు దశాబ్దాల్లో భారత్-అమెరికా రక్షణ సంబంధాలు వేగంగా విస్తరించాయి. 2008లో దాదాపు శూన్యంగా ఉన్న ద్వైపాక్షిక రక్షణ వాణిజ్యం ప్రస్తుతం 20 బిలియన్ డాలర్లకు చేరింది. సంయుక్త సైనిక విన్యాసాలు, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, వ్యూహాత్మక సహకారం కూడా గణనీయంగా పెరిగాయి. తాజా ఆమోదం రెండు దేశాల మధ్య పెరుగుతున్న విశ్వాసానికి మరో నిదర్శనంగా భావిస్తున్నారు.

## నేడు పులివెందులకు వెళుతున్న జగన్.. ప్రజలను నేరుగా కలవనున్న వైసీపీ అధినేత

మొదటి పేజి తరువాయి

నేటి నుండి జూన్ 25 వరకు సాగే ఈ పర్యటనలో ఆయన స్థానిక నేతలతో సమీక్షలు జరపడంతో పాటు ప్రజలను నేరుగా కలవనున్నారు. నేడు సాయంత్రానికి జగన్ పులివెందులకు చేరుకుంటారు. అక్కడ ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక వైసీపీ నేతలు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అక్కడికక్కడే 'ప్రజాదర్బార్' కూడా నిర్వహించనున్నారు. పర్యటనలో భాగంగా రెండో రోజైన జూన్ 24 ఉదయం వేముల మండలం భూమయ్యగారిపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని జగన్ సందర్శించనున్నారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొంటారు. గుడి దర్శనం ముగించుకుని మధ్యాహ్నానికి మళ్లీ పులివెందుల క్యాంప్ ఆఫీస్‌కు రానున్న జగన్.. ఆ రోజు మొత్తం ప్రజలు, పార్టీ శ్రేణులతో ముఖాముఖి మాట్లాడుతారు. ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాధితుల అర్జీలను స్వీకరిస్తారు. అనంతరం మూడు రోజుల పర్యటన ముగించుకుని జూన్ 25వ తేదీ గురువారం ఉదయం పులివెందుల నుంచి తిరుగుపయనమవుతారు.

## నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు.. వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా

వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని మర్చిపోం. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను కూడా మర్చిపోం. నేను కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. పక్కా విడిచిపెట్టను" అని అన్నారు. కార్యకర్తలను వేధించిన వారు ఎక్కడున్నా వదలబోమని కేటీఆర్ హెచ్చరించారు. "రిటైరైనా, పారిపోయినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. మా కార్యకర్తలను సతాయించిన ఒక్కొక్కడినీ వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది. వదిలిపెట్టే సమస్యే లేదు. ఇది ఊరికే చెప్పడం లేదు, గుర్తు పెట్టుకోండి" అని ఆయన వ్యాఖ్యానించారు.

## రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టు

అమరావతి: రెండేళ్ల పాలనలో వివిధ రంగాలు, అంశాల్లో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం 'ప్రోగ్రెస్ రిపోర్ట్ 2024-26' పేరిట నివేదికలను విడుదల చేయనుంది. మొత్తం 10 అంశాలపై ఈ నివేదికలు ఇవ్వాలని నిర్ణయించింది. వీటిల్లో 1. అభివృద్ధి, 2. ఆర్థిక రంగం, 3. సుపరిపాలన, 4. సంక్షేమం-సాధికారత అంశాలకు సంబంధించిన నివేదికలను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా విడుదల చేయనున్నారు. 5. పోలవరం ప్రాజెక్ట్, 6. రాజధాని అమరావతి, 7. విద్యుత్ రంగం, 8. శాంతి భద్రతలు, 9. మైనింగ్, 10. ఎక్సైజ్ రంగాల నివేదికలను ఆయా శాఖల మంత్రులు విడుదల చేస్తారు. తొలుత విద్యుత్ రంగంపై నివేదికను సోమవారం ఆ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటిస్తారు. అన్ని రంగాలకు సంబంధించిన నివేదికల విడుదలను జులై 18 నాటికల్లా పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఆ తర్వాత వాటన్నింటినీ కలిపి ఒక పుస్తక రూపంలో తీసుకురావాలని ముఖ్యమంత్రి సంబంధిత మంత్రులు, అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

శ్వేతపత్రాల్లోని అంశాలపై తీసుకున్న చర్యలతో

కూటమి అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి, విద్యుత్ రంగం, శాంతి భద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ వంటి రంగాల్లో నెలకొన్న పరిస్థితిపై అప్పట్లో మొత్తం 7 శ్వేతపత్రాలు విడుదల చేశారు. ఈ రెండేళ్లలో ఆ శ్వేతపత్రాల్లోని అంశాలపై తీసుకున్న చర్యలనూ (యాక్షన్ టేకెన్ రిపోర్టు) ఈ ప్రోగ్రెస్ రిపోర్టుల్లో పొందుపరచాలని సీఎం ఆదేశించారు. వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గత రెండేళ్లలో వికాసం వైపు తీసుకెళ్లిన విధానం, ఆయా రంగాల్లో సాధించిన పురోగతి తదితర వివరాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనలో తీసుకొచ్చిన సంస్కరణలు వంటివి ఈ నివేదికల ద్వారా ప్రజలకు వివరించాలని చంద్రబాబు చెప్పారు. రెండేళ్లలో పరిపాలనను, ప్రభుత్వాన్ని ఎలా గాడిలో పెట్టామో చెప్పడంతోపాటు ఫేక్ న్యూస్‌కు చెక్ పెట్టడమే ఈ నివేదికల ఉద్దేశమని వివరించారు. వీటిని ఏటా ఇవ్వాలని సూచించారు. వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటక రంగాల్లో సాధించిన అభివృద్ధి, చేపట్టిన చర్యలు, విజయాల వివరాలతో 'అభివృద్ధి' అంశంపై, కూటమి అధికారంలోకి వచ్చాక పాలనలో చేపట్టిన సంస్కరణలు, తీసుకొచ్చిన విధానాలు, అనుసరించిన పద్ధతులు తదితర వివరాలతో 'సుపరిపాలన' అంశంపై, సంక్షేమం, పీ4 కార్యక్రమాల వివరాలతో 'సంక్షేమం-సాధికారత' అంశంపైన ప్రోగ్రెస్ రిపోర్టులు సిద్ధం చేయాలని సీఎం నిర్దేశించారు. మంత్రులు ఆయా రంగాలకు సంబంధించిన నివేదికలను విడుదల చేయడం పూర్తి చేసిన తర్వాత చివర్లో నాలుగు అంశాలపై ముఖ్యమంత్రి ప్రోగ్రెస్ రిపోర్టులు ఇస్తారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జీరాంజీపై ఇతర రాష్ట్రాలతో కలిసి పోరాడతాం

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి అమలు చేయనున్న జీరాంజీకి వ్యతిరేకంగా భాజపాయేతర పార్టీలు పాలించే రాష్ట్రాలతో కలిసి ఉమ్మడిగా పోరాడాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని అభిప్రాయపడింది. పథకంపై ప్రభుత్వానికి సమగ్ర సిఫార్సులు అందించేందుకు అంశాలవారీగా అధ్యయనం కొనసాగించాలని గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తుది నివేదిక రూపొందించాలని తీర్మానించింది. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం జరిగింది. పంచాయతీరాజ్, వ్యవసాయ, కార్మికశాఖల మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త చట్టం వల్ల గ్రామీణుల ఉపాధి, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలపై చర్చించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధిపై చట్టం ప్రభావం వంటి అంశాల గురించి అధికారులు వివరించారు. కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం అమలు సాధ్యం కాదని మంత్రులు అన్నారు. దీనివల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు కూలి రేట్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం 40% నిధుల భారాన్ని మోపడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు భాజపాయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలతోనూ సంప్రదింపులు జరపాలని సమావేశం నిర్ణయించింది. మరో రెండు మూడు రోజుల్లో సబ్ కమిటీ మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించాలని నిర్ణయం తీసుకుంది.

కేంద్రం కుట్రలను అడ్డుకుంటాం

సమావేశం అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ "ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు కల్పించిన హక్కులను క్రమంగా నిర్వీర్యం చేసి, రాష్ట్రాల అధికారాలను హరించేందుకు కేంద్రం కుట్రపూరితంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకొస్తోంది. దీనిని అడ్డుకుంటాం. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం దేశ చరిత్రను అవమానించడమే. రాంజీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## విజయవాడ సాయికృష్ణ ఒక క్రిమినల్ అన్నట్టుగా పవన్ మాట్లాడుతున్నారు: అంబటి రాంబాబు



అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. విజయవాడ సాయికృష్ణ అదృశ్యం కేసు అంశంపై పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వం బాధితులకు న్యాయం చేస్తామని చెబుతుంటే... మరోవైపు సాయికృష్ణను ఒక క్రిమినల్ అన్నట్టు పవన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జనసేన నేత సామినేని ఉదయభాను మాత్రం బాధితుడి ఇంటికి వెళ్లి పవన్ పంపిస్తేనే వచ్చామంటున్నారని, అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే క్లారిటీ లేదన్నారు. ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే 'సిట్' నాటకాలు ఆపి, సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతల తాటతీస్తామంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై అంబటి తీవ్రంగా స్పందించారు. "రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ సీఎం పదవిలో ఉండి మాట్లాడే భాషేనా ఇది? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరు" అని స్పష్టం చేశారు. అలాగే 'నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం' అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి అనిత సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని... అందుకే పవన్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని అంబటి గుర్తు చేశారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూనే.. మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని వెనక ఉండి ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని దుయ్యబట్టారు.

## నౌకాయాన సామర్థ్యమే రక్షాకవచం



కోల్‌కతా: నౌకాయానపరంగా బలమైన సామర్థ్యంతో ఉండటం.. ఏ దేశ ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావాన్నైనా నిర్ణయించడంలో కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనిని మన దేశం అర్థం చేసుకుని తదనుగుణంగా సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు దేశీయంగా నిర్మించిన ఐఎన్ఎస్ దునాగిరీ, ఐఎన్ఎస్ అగ్రయ్, సర్వే నౌక ఐఎన్ఎస్ సంశోధక్‌లను ఆయన జాతికి అంకితం చేశారు. శత్రువుల ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఓడరేవులో ప్రధాని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం మన దేశం చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని పేర్కొన్నారు.

### సైనికావసరాలు ప్రపంచానికి మార్కెట్ కారాదు

'భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమవల్లే నూతన నౌకల నిర్మాణం సాధ్యమైంది. రక్షణపరమైన కొనుగోళ్లు చేసే దేశంగానే మిగిలిపోవాలని మనం కోరుకోవడం లేదు. మన సైనిక దళాలు ప్రపంచానికి కేవలం మార్కెట్‌గా మారకూడదు. స్వయం సమృద్ధిద్వారా మన సామర్థ్యానికి గుర్తింపు లభిస్తుందే తప్ప ఇలాంటి మార్కెట్‌వల్ల కాదు. నౌకాయానంపై ఆధిపత్యం లేకుండా ఏ దేశమైనా పెద్ద శక్తిగా ఎదగజాలదు. అభివృద్ధి, రక్షణ, సుసంపన్నత అనేవి సముద్రాలతో ముడిపడి ఉంటాయి' అని ప్రధాని చెప్పారు. లక్షల ఉద్యోగాలు సృష్టించగల సత్తా నౌకాయాన రంగానికి ఉందన్నారు. నౌకాయాన శక్తిలో తదుపరి దశలో ప్రవేశించే సమయం ఆసన్నం కావడంతో నౌకా నిర్మాణ పరిశ్రమలో నూతన దార్శనికత దిశగా పయనిస్తున్నామని చెప్పారు. ఓడరేవుల ఆధారిత ఆర్థిక వృద్ధికి సాగరమాల ప్రాజెక్టు ఉపకరిస్తుందని చెప్పారు.

## పంట కాలువలలో సిల్ట్ తీయించిన ఎమ్మెల్యే డాక్టర్ బి వి జగనేశ్వర్ రెడ్డికీ కృతజ్ఞతలు తెలిపిన నందవరం మండల రైతులు





నందవరం,శివసూర్య,జూన్ 22:నందవరం మండల పరిధిలోని ముఖచినుండి రోడ్డు వరకు సుమారు 7 లక్షల రూపాయలతో ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కాలువ ఛైర్మన్ బోయ వీరేష్ ఆధ్వర్యంలో జెసిబి కి పూజలు చేసి మట్టిని తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన యముడు ఎమ్మెల్యే రైతుల పక్షపాతని రైతుల కోసం ఏమైనా చేసే అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపిస్తారని రైతులంటే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి కి ఎంతో అభిమానం అనే తెలిపారు ఈ పంటకాలకు గ్రావెల్ రోడ్డు అయితేనేమి, కాలంలో సిల్టు తీయడానికి అయితేనేమి సుమారుగా ఏడు లక్షల రూపాయలు మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఎల్ఎల్సీ కాలువ అధికారులు పాల్గొన్నారు.

## వాలీబాల్ క్రీడాకారులకు ప్రోత్సహించడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధమే

- సోషియో స్పోర్ట్స్ సంస్థ సీ.ఈ.వో. కృష్ణ వీర ఫణీంద్ర. -



కర్నూలు స్పోర్ట్స్ న్యూస్, శివసూర్య, జూన్ 22: అంతర్ పాఠశాలల వాలీబాల్ పోటీలను ముఖ్య అతిథిగా సోషియో స్పోర్ట్స్ సంస్థ సీఈవో కృష్ణ వీర ఫణీంద్ర హాజరై ప్రారంభించారు. పోటీలకు హాజరైన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ 5,000 మందికి పైగా క్రీడాకారులకు స్పోర్ట్స్ మెటీరియల్ స్పాన్సర్




చేయడం ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రాక్టీస్ కిట్లు, బంతులు, స్పైక్స్, ఫిట్‌నెస్ పరికరాలు వంటి అవసరమైన సామగ్రిని అందించడం.100 మందికి పైగా క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం.100 మందికి పైగా ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి, వారికి ౹ూయా, ౹ూ× లేదా మంచి అకాడమీల లో ప్రవేశం కల్పించేందుకు సహకరించడం. 1,000 మందికి పైగా క్రీడాకారులకు కెరీర్ గైడెన్స్ అందిడం "ఆట తర్వాత ఏమిటి?" అనే ప్రశ్నకు సరైన మార్గదర్శకత్వం అందించి, వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయడం.ఈ లక్ష్యాలను చేరుకోవడం అంత సులభం కాదు. ఎన్నో కష్టాలు, ఎన్నో అవాంతరాలు ఎదురవుతాయి. అయినప్పటికీ, సోషియోస్పోర్ట్స్ దృధ సంకల్పంతో ఈ లక్ష్యాలను సాధించేందుకు ముందుకు సాగుతోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు. సోషియో స్పోర్ట్స్ సంస్థ సీఈవో కృష్ణ వీర పనింద్ర ఆధ్వర్యంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. జిల్లాలో ప్రతి మండలంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు వాలీబాల్ మెటీరియల్ స్పాన్సర్ చేస్తూ , ప్రతిభ కలిగిన క్రీడాకారులకు వాలీబాల్ మెళుకువలు నేర్పిస్తూ ప్రోత్సహించు వాలీబాల్ క్రీడను మరింత అభివృద్ధి అయ్యేలా కృషి చేస్తున్న శాప్ వాలీబాల్ శిక్షకులు రవి నీ ప్రత్యేకంగా శాలువా పుష్ప గుచ్ఛంతో సన్మానించారు

## మంత్రాలయంలో బాలికలకు చదువే దూరం




**మంత్రాలయం,శివసూర్య ప్రతినిధి, జూన్ 22:రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్ఏవీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఏవీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజా మాట్లాడుతూ మంత్రాలయంలో బాలికల ప్రీ మెట్రిక్ హాస్టల్ లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.కరువు, వలసలు, నిరక్షరాస్యతతో మంత్రాలయం నియోజకవర్గం విలవిలలాడుతున్నా నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లు, వసతి లభించక చాలామంది బాలికలు మధ్యలోనే చదువు ఆపేసి బాల్య వివాహాలకు గురవుతున్నారని తెలిపారు.ఇటీవల జరిగిన ఒక సర్వేలో టీనేజ్ ప్రెగ్నెన్సీలో మంత్రాలయం నియోజకవర్గం జిల్లాలోనే మొదటి స్థానంలో నిలవడానికి నియోజకవర్గంలో ఉన్నత విద్యావకాశాలు లేకపోవడమే కారణమని, దీనికి అధికారులు, నాయకుల నిర్లక్ష్యమే బాధ్యత అని ఆరోపించారు.ఇకనైనా మంత్రాలయంలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆర్ఏవీఎఫ్ నాయకులు హెచ్చరించారు.**

## రహదారిలో డ్రైనేజీ బ్లాక్‌లకు చెక్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక జెట్ మెషిన్‌తో క్లీనింగ్.. అధికారుల పర్యవేక్షణ



మంత్రాలయం,శివసూర్య ప్రతినిధి,జూన్ 22:మంత్రాలయం పట్టణ ప్రధాన రహదారిలో గత వారం రోజులుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ బ్లాక్‌లను హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన జెట్ మెషిన్ సహాయంతో సోమవారం తొలగించారు. డ్రైనేజీ నీరు రోడ్డుపై



ప్రవహిస్తూ దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి హైదరాబాద్ నుంచి అధునాతన జెట్ మెషిన్‌ను రప్పించారు. సోమవారం ఉదయం నుంచి ౼రాజు మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వరదరాజులు స్వయంగా దగ్గరుండి క్లీనింగ్ పనులు పర్యవేక్షించారు.మిషన్ ఆపరేటర్లు జెట్ మెషిన్‌తో డ్రైనేజీ లైన్‌లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. శ్రమించి ప్రధాన లైన్‌లోని బ్లాక్‌లను క్లియర్ చేశారు. దీంతో డ్రైనేజీ నీరు సాఫీగా ప్రవహించడం ప్రారంభమైంది. సమస్య పరిష్కారం కావడంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదని, పాత డ్రైనేజీ లైన్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. అధికారులు స్పందించి త్వరలోనే శాశ్వత మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు.

## బుట్టా రేణుక ను మర్యాదపూర్వకంగా కలుసుకొని హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు





హైదరాబాద్, శివసూర్య, జూన్ 22:బివైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు, ప్రజాసేవకు చిరునామాగా నిలిచిన బుట్టా రేణుక గారిని హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.ఆర్. రామకోటేశ్వర్ రెడ్డి, నందవరం మండల కన్వీనర్ జె. శివారెడ్డి గౌడ్ , రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షి రెడ్డి , ఎమ్మిగనూరు పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు డి. నజీర్ అహమ్మద్ గారు, నందవరం మండల ప్రధాన కార్యదర్శి కనకవీడు పేట శ్రీనివాస్, ఎమ్మిగనూరు మండల యువజన విభాగ అధ్యక్షులు బనవాసి బసిరెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకొని హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.నాయకుల బుట్టా రేణుక ను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకురాలిగా, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే ఆత్మీయ నాయకురాలిగా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించే ప్రజానాయకురాలిగా శ్రీమతి బుట్టా రేణుక గారు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు.అలాగే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ అధినేత ఆశయాల సాధనకు ఆమె అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.అనంతరం బుట్టా రేణుక గారి ఆశీస్సులు పొందిన నాయకులు, ఆమెకు మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## పేదరికం చదువుకు అడ్డు కాదు... నీకు నేనున్నా...!

బండారి మమత చదువుకు అండగా నిలిచిన హొళగుంద ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్




హొళగుంద శివసూర్య న్యూస్ జూన్ 22:కర్నూలు జిల్లా, ఆలూరు తాలూకా, హొళగుంద మండలానికి చెందిన బండారి.మమత నిరుపేద కుటుంబంలో జన్మించింది. తల్లిదండ్రులకు నలుగురు కుమార్తెలు ఉండగా, మమత రెండో కుమార్తె. కుటుంబ పోషణ కోసం ఆమె తల్లిదండ్రులు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు కొనసాగించడం కష్టమని కుటుంబ సభ్యులు చెప్పడంతో మమత తీవ్ర ఆవేదనకు గురైంది.ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ఎం.ఎస్. రాజు గారు (మడకశిర ఎమ్మెల్యే) గారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి =ఖు సంస్థ ప్రతినిధులతో మాట్లాడి మమతకు రూ. 40,000/-వేలు సెమీ స్కాలర్‌షిప్ మంజూరు అయ్యేలా సహకరించారు. అదే విధంగా, మమత పరిస్థితిని తెలుసుకున్న హొళగుంద ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్ గారు కూడా మానవత్వంతో స్పందించి, ఆమె ఉన్నత విద్యకు అవసరమైన 22,000/- వేలు ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలిచారు.అలాగే మిగతా ఫీజు మరియు సీటు విషయమై కర్నూలు శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యంతో చర్చించి మమత చదువు కొనసాగేందుకు తోడ్పడ్డారు.ఈ సందర్భంగా తన చదువుకు సహకరించిన ఎం.ఎస్.రాజు (మడకశిర ఎమ్మెల్యే) గారికి, హొళగుంద ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్ గారికి, =ఖు సంస్థకు, బండారి మమత హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. "పేదరికం చదువుకు అడ్డం కాదు... సమాజం అండగా ఉంటే ప్రతిభ తప్పకుండా విజయం సాధిస్తుంది" అని మమత పేర్కొంది.

## రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వం లక్ష్యం




నందవరం, శివసూర్య, జూన్ 22:నందవరం మండల పరిధిలోని ముగతి గ్రామంలో రైతులకు యూరియా ను ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ రైతులకు యూరియా పంపిణీ



చేసి,వ్యవసాయ అవసరాలకు ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.రైతే దేశానికి వెన్నెముక అని,రైతుల సంక్షేమం మరియు వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.వ్యవసాయ రంగం బలోపేతం కావడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని,రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్న గౌడ్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశాయి,రైస్ మిల్ నారాయణరెడ్డి,సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్,మండల కన్వీనర్ కాశీం వలి,కాపు వీరారెడ్డి,గొర్రెల సంఘం అధ్యక్షులు కొండారెడ్డి,వెంకటేష్,నాగరాజు,వ్యవసాయ శాఖ అధికారులు ఎడిఏ మహ్మద్ ఖాద్రి,ఏ ఓ సరిత, శివశంకర్,ఎంపిఈ ఓ ప్రశాంతి గ్రామ నాయకులు,కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచిన ప్రజల నాయకుడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఈబీజీ గోవింద్ గౌడ్



హోళగుంద,శివసూర్య, జూన్ 22: మండలంలోని బీసీ కాలనీ బుడగజంగాల వీధికి చెందిన ఒక మధ్యతరగతి కుటుంబంలో యువకుడు గుండె మరియు ఊపిరితిత్తుల సంబంధిత తీవ్రమైన అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడని తెలుసుకున్న వెంటనే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈబీజీ



గోవింద్ గౌడ్ గారు మానవత్వంతో స్పందించారు. బాధలో ఉన్న ఆ కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి, తనకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించి ఆ యువకుడి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం, వారి బాధను తన బాధగా భావించడం ఈబీజీ గోవింద్ గారి గొప్ప మనసుకు నిదర్శనం.ఈ కార్యక్రమంలో మాజీ వీుఅజ ఎర్రస్వామి గారు, మండల మైనార్టీ అధ్యక్షుడు ముల్లా మోయిన్ గారు,టిడిపి మైనారిటీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ గారు టీడీపీ సీనియర్ నాయకులు బుడగజంగాల రామాంజిని గారు, హుసేన్ పీర్ గారు, గోవిందు గారు, కోనేరు ఎల్లప్ప గారు, కొండ భీమన్న గారు, అలాగే టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఆ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, "మా కష్టాన్ని తెలుసుకున్న వెంటనే స్పందించి సహాయం చేసిన ఈబీజీ గోవింద్ గౌడ్ గారికి జీవితాంతం రుణపడి ఉంటాము. మీలాంటి మంచి నాయకుడు మా మధ్య ఉండటం మా అదృష్టం అని కృతజ్ఞతలు తెలిపారు.ఓప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ ముందుండి, సమస్య ఏదైనా బాధ ఎవరిదైనా వెంటనే స్పందించి సహాయం చేసే వ్యక్తిత్వం ఈబీజీ గోవింద్ గారిది. ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందిస్తూ, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న ఇలాంటి నాయకులు సమాజానికి ఎంతో అవసరం.

## రోడ్డు ప్రమాదంలో భూపాలపల్లి జిల్లా రవాణా అధికారి (డి టి ఓ ) వెంకన్న దుర్మరణం!

,)భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చేల్పూరు గ్రామంలో ఉన్న ఆర్టీవో కార్యాలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో జిల్లా రవాణా అధికారి (డి టి ఓ) వెంకన్న అక్కడికక్కడే మృతి చెందారు.

**వివరాల్లోకి వెళ్తే...**

భూపాలపల్లి జిల్లా రవాణా అధికారి వెంకన్న తన విధి నిర్వహణలో భాగంగా రోడ్డుపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన రోడ్డు పక్కన నిలబడి ఉండగా, ఒక బొగ్గు టిప్పర్ డి నుండి దూసుకెళ్లింది. ఈ తీవ్రమైన ప్రమాదంలో వెంకన్నకు బలమైన గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. జిల్లా రవాణా అధికారి మృతి చెందడంతో భూపాలపల్లి జిల్లాలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

**15 రోజుల క్రితమే బదిలీపై రాక:**

మృతి చెందిన వెంకన్న గత 15 రోజుల క్రితమే జగిత్యాల జిల్లా నుంచి భూపాలపల్లికి బదిలీపై వచ్చారు. ఇక్కడికి వచ్చినప్పటి నుండి ఆయన నిత్యం వాహనాల తనిఖీలు చేపట్టడంతో పాటు, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల బస్సులకు సైతం ఫిట్‌నెస్ చేయించారు. జిల్లాకు బదిలీపై వచ్చి రాగానే తనదైన శైలిలో ముద్ర వేసుకున్న అధికారి వెంకన్న, ఇలా రోడ్డు ప్రమాదంలో అకస్మాత్తుగా చనిపోవడం పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని, సెంటిమెంట్‌ను వ్యక్తం చేస్తున్నారు.

**మరొకరికి తీవ్ర గాయాలు.. కేసు నమోదు:**

ఇదే ప్రమాదంలో ఆర్టీవో ఆఫీస్‌లో ఏదో ఒక పని నిమిత్తం వచ్చిన రజిత అనే మహిళకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, వెంకన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# జిల్లా ఉత్తమ విధానాలపై ప్రత్యేక బుక్‌లెట్‌ను సిద్ధం చేయండి

రెండేళ్ల అభివృద్ధి ప్రస్థానాన్ని ఒకే బుక్‌లెట్‌లో ఆవిష్కరించాలి

శాఖల సమన్వయంతో నాణ్యమైన సక్సెస్ స్టోరీలను రూపొందించాలి

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల, జూన్ 22:-గత రెండేళ్ల కాలంలో జిల్లాలో వివిధ శాఖలు అమలు చేసిన ఉత్తమ విధానాలు, వినూత్న కార్యక్రమాలు, ప్రజలకు అందించిన మెరుగైన సేవలను సమగ్రంగా ప్రతిబింబించేలా ఉత్తమ కథనాలతో ప్రత్యేక బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శాఖ తమ పరిధిలో అమలు చేసిన ఉత్తమ విధానాలు, సక్సెస్ స్టోరీలను సంక్షిప్తంగా, ప్రభావవంతంగా రూపొందించాలని తెలిపారు. ఒక్కో అంశం ఒకటి లేదా రెండు పేజీలకు మించకుండా ఉండాలని, అందులో జిల్లా పరిస్థితి, ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారానికి అనుసరించిన వ్యూహాలు, అమలు విధానం, సాధించిన ఫలితాలు స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. ప్రతి కథనానికి ఆకర్షణీయమైన శీర్షికతో పాటు నాణ్యమైన హెచ్‌డీ ఫోటోలను జతచేయాలని కలెక్టర్ తెలిపారు. బుక్‌లెట్ తయారీ బాధ్యతలను పీడీ డీఆర్‌డీఏ, పీడీ మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయం, ఉద్యానవనం, సూక్ష్మ నీటిపారుదల, పశుసంవర్ధక, మత్స్యశాఖలకు సంబంధించిన ఉత్తమ విధానాలను సమన్వయం చేయాలని, మహిళా నర్సరీలు, కొత్త పంటల ప్రవేశపెట్టడం వంటి విజయగాథలను పొందుపరచాలని సూచించారు.భూగర్భజల శాఖ చేపట్టిన డిఫంక్ట్ బోర్‌వెల్ రీఛార్జ్ కార్యక్రమంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉత్తమ విధానాలను సేకరించాలని, అలాగే పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, హౌసింగ్ తదితర ఇంజినీరింగ్ శాఖలు తమ వినూత్న కార్యక్రమాల కథనాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్సైజ్, కమర్షియల్ టాక్సెస్, రిజిస్ట్రేషన్స్, మైనింగ్, లీగల్ మెట్రాలజీ వంటి ఆదాయ వనరుల శాఖల వివరాలను జిల్లా రిజిస్ట్రార్ సమన్వయం చేయాలని, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, ఏపీఐఐసీకి సంబంధించిన వివరాలను కాలుష్య నియంత్రణ మండలి ద్వారా సేకరించాలని సూచించారు. మున్సిపాలిటీల్లో అమలవుతున్న స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్ ఆధారిత ఉత్తమ విధానాలను మున్సిపల్ కమిషనర్లు సమన్వయం చేయాలని, పోలీసు శాఖ అమలు చేసిన వినూత్న కార్యక్రమాలను కూడా బుక్‌లెట్‌లో పొందుపరచాలని తెలిపారు. పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, దేవాదాయ శాఖలకు సంబంధించిన విశిష్ట కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.కలెక్టరేట్ తరపున జిల్లా హెచ్‌ఆర్‌డీ, పీజీఆర్ఎస్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు సంబంధించిన మూడు ప్రధాన ఉత్తమ కథనాలను ప్రత్యేకంగా రూపొందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ బలోపేతం, సిఎస్ఆర్ నిధులతో స్టార్టప్‌ల కోసం అభివృద్ధి చేస్తున్న ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వంటి అంశాలను ఇందులో పొందుపరుస్తామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో అమలైన ఉత్తమ విధానాలు రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిచేలా నాణ్యమైన డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు,శివసూర్య,జూన్ 22:రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు జిల్లాలో ఈ నెల 24 వ తేదీన పర్యటిస్తున్న సందర్భంగా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.ఈ నెల 24 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరిలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్ లో పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, వ్యూ పాయింట్, బహిరంగ సభ, స్టాళ్ల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



హెలిప్యాడ్ కో ఆర్డినేట్స్, లైటింగ్ తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించారు. మైనింగ్ వ్యూ పాయింట్, బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలిస్తూ, బహిరంగసభకు సుమారు 5 వేల నుంచి 10 వేల మంది వరకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వేదిక ఏర్పాట్లు, ప్రజలకు తాగునీరు, భోజన వసతి, మరుగుదొడ్లు, పార్కింగ్, సీటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, తదితర అంశాలపై ఎస్పీ, కలెక్టర్ చర్చించి పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర,జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రదీప్ కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, , తదితరులు పాల్గొన్నారు

# పోలియో రహిత సమాజ పరిరక్షణకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

జూన్ 28 నుంచి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి




నంద్యాల,శివసూర్య,జూన్ 22:దేశంలో పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలన సాధించినప్పటికీ, పొరుగు దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వ్యాధి తిరిగి వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల స్వీకరణ అనంతరం పల్స్ పోలియో కార్యక్రమం, డయేరియా నివారణ చర్యలు, వర్షాకాలంలో తలెత్తే అంటువ్యాధుల నియంత్రణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో వంద శాతం విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం దేశం పోలియో రహితంగా ఉన్నప్పటికీ ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, నైజీరియా వంటి దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్నందున ప్రతి సంవత్సరం ప్రత్యేక రక్షణ చర్యగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28వ తేదీ ఆదివారం మొదటి రోజు పోలియో బూత్‌ల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామని, అదే రోజున 90 నుంచి 95 శాతం మంది పిల్లలను కవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. అనంతరం జూన్ 29, 30 తేదీలలో ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో జననం నుండి ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమం కోసం దాదాపు మూడు లక్షల వ్యాక్సిన్ డోసులను సిద్ధం చేసి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తున్నామని, వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా కోల్డ్ చైన్ వ్యవస్థను పటిష్టంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం మెడికల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లతో మండల, గ్రామ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి తగిన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్య, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్డీఏ తదితర శాఖలను భాగస్వామ్యం చేసి వంద శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా 1320 పోలియో బూత్‌లు, 44 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 4 వేల మంది సిబ్బందికి శిక్షణ అందించామని, వలస కూలీలు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు, ఫ్యాక్టరీలు, పట్టణ మురికివాడలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పిల్లలు ఎవరూ మిస్ కాకుండా మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల నోటీస్ బోర్డులు, గ్రామ సభలు, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పోలియో కార్యక్రమంలో నమోదయ్యే వివరాలను వెంటనే యాప్‌లో నమోదు చేస్తూ రియల్ టైమ్ డేటా అప్డేషన్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పని చేయడమే కాకుండా రికార్డులను కూడా సకాలంలో నవీకరించడం ద్వారా ఖచ్చితమైన కవరేజ్ శాతం తెలుసుకోవచ్చని, మిగిలిన పిల్లలను ప్రత్యేక మాప్-అప్ రౌండ్ల ద్వారా కవర్ చేయవచ్చని తెలిపారు.డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలివర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డయేరియా నియంత్రణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో డైరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, ఓఆర్ఎస్ కార్నర్ల ఏర్పాటు, ఇంటి వద్దే ఓఆర్ఎస్ ద్రావణం తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డీహైడ్రేషన్ లక్షణాలు కనిపించిన వెంటనే పిల్లలకు ఓఆర్ఎస్ అందించి అవసరమైతే ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు, డ్రైనేజీ సమస్యలను వెంటనే గుర్తించి సరిచేయాలని, కలుషిత నీటి వల్ల వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బహిరంగ మలవిసర్జన నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాల కారణంగా దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అవసరమైన చోట ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ చేపట్టి దోమల పెరుగుదలను అరికట్టాలని ఆదేశించారు.అదేవిధంగా కలుషితమైన లేదా నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో పోలియో, డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. లిఅదేవిధంగా కలుషితమైన లేదా నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో పోలియో, డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. అనంతరం పోలియో నివారణ గోడపత్రికను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ సంబంధిత వైద్య అధికారులు ఆవిష్కరించారు.

# ప్రజా అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా సత్వరమే పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌లో 349 ప్రజా దరఖాస్తుల స్వీకరణ

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల,శివసూర్య,జూన్ 22:రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారం అందించాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించినప్పటికీ తిరిగి రీఓపెన్ అయిన 96 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖలు నాణ్యమైన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి స్థాయిలో



నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికకు సంబంధించిన నాలుగు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తగిన ఎండార్స్‌మెంట్‌తో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

## రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 177 అర్జీల స్వీకరణ

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించే అవకాశాన్ని ఈ క్లినిక్‌లు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 177 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 2, అడంగల్ సవరణలకు సంబంధించినవి 15, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఏ భూములకు సంబంధించినవి 11, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 33, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 67, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 41, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 8 దరఖాస్తులు ఉన్నట్లు వివరించారు.

## పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన కొన్ని ముఖ్య అర్జీలు

1)డోన్ మండలం: తెలుగు రాజమ్మ అనే మహిళ తనకు వారసత్వంగా వచ్చిన సర్వే నంబర్ 460లోని నాలుగు ఎకరాల భూమిని తామే సాగు చేసుకుంటున్నప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేర్లు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2)బండి ఆత్మకూరు మండలం: పెద్ద దేవలాపురం గ్రామ ఎస్సీ కాలనీలోని 80 సెంట్ల భూమిలో 30 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించి సాగు చేస్తున్నారని, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసి న్యాయం చేయాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. 3)సిరివెళ్ల మండలం: గోవిందపల్లె గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, గ్రామ పొలిమేరలోని సర్వే నంబర్ 378లో తనకు 2.14 ఎకరాల భూమి ఉండగా, ఆన్‌లైన్ రికార్డుల్లో 2.06 ఎకరాలు మాత్రమే నమోదయ్యాయని, మిగిలిన భూమిని కూడా రికార్డుల్లో నమోదు చేయాలని విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

# నాణ్యమైన పరిష్కారాలు చూపి అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడండి

అధికారులు పీజీఆర్ఎస్ అర్జీలపై మరింత బాధ్యతతో వ్యవహరించాలి

రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులను పూర్తిగా తగ్గించాలి

పెండింగ్‌లో ఉన్న అర్జీలు, ఫిర్యాదులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ



కర్నూలు,శివసూర్య,జూన్ 22:ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా రెవెన్యూ



అధికారి (డి ఆర్ ఓ) వెంకటనారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను డి.ఆర్.ఓ స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని, పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలని డి.ఆర్.ఓ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, అందుకు గల కారణాలను పూర్తిగా వివరించడంతో పాటు, తీసుకోబోయే చర్యలపై కూడా అర్జీదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల సంఖ్యను పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకటరమణారెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డా. లోకరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అనాథ విద్యార్థులకు పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్ల పంపిణీ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యతకు నిదర్శనం



ఆళ్లగడ్డ,శివసూర్య,జూన్ 22:ఆళ్లగడ్డ పట్టణంలోని బాలసదనం అనాథ ఆశ్రమంలో నివసిస్తున్న 30 మంది విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆళ్లగడ్డ శాఖ ఆధ్వర్యంలో పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడేలా మొత్తం 60 పుస్తకాలను పంపిణీ చేయడంతో పాటు, చిన్నారుల ఆనందాన్ని దృష్టిలో ఉంచుకుని బిస్కెట్లు, చాక్లెట్లను అందజేశారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యా ప్రోత్సాహం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ అయ్యప్ప రెడ్డి, ఆళ్లగడ్డ శాఖ మేనేజర్ రాజశేఖర్ రెడ్డి హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు అని, ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి భవిష్యత్తు అభివృద్ధికి తోడ్పడటం బ్యాంకు సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, జీవితంలో మంచి స్థాయికి ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. బాలసదనం నిర్వాహకులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సమాజం తమకు అండగా ఉందనే భావనను కలిగిస్తాయని పేర్కొన్నారు.

# శ్రీమఠంలో వైభవంగా ఊంజల్ సేవ



మంత్రాలయం,శివసూర్య ప్రతినిధి,జూన్ 22:పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో సోమవారం ఊంజల్ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త ప్రహ్లాదుడిని ప్రత్యేకంగా అలంకరించిన వెండి ఉయ్యాలలో ఉంచి వేద మంత్రాల నడుమ ఊంజల్ సేవ జరిపించారు.అనంతరం గురు రాఘవేంద్ర స్వామివారి మూల బృందావనానికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. విశేష పూజల అనంతరం స్వామివారి బృందావనాన్ని పట్టు వస్త్రాలు, గులాబీ, మల్లె, సంపెంగి తదితర పుష్పమాలలతో, బంగారు కలశంతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు.ఈ కార్యక్రమంలో మఠం అధికారులు, సిబ్బంది, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# గురు సార్వభౌమ వేద పాఠశాలలో సోమయాగం

## ప్రత్యేక పూజలు చేసిన శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు



మంత్రాలయం,శివసూర్య ప్రతినిధి,జూన్ 22:మంత్రాలయం గురు సార్వభౌమ వేద పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సోమయాగం మూడో రోజుకు చేరుకుంది. సోమవారం శ్రీ రాఘవేంద్ర స్వామి



మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామీజీ యాగశాలకు విచ్చేశారు.స్వామీజీ యాగశాలలోని ఏర్పాట్లను, క్రతువు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం యాగ వేదిక వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి యాగ నిర్వాహకులను, వేద పండితులను ఆశీర్వదించారు. స్వామీజీ రాకతో యాగశాలలో వైదిక వాతావరణం మరింత శోభాయమానంగా మారింది.లోక కల్యాణార్థం, దేశంలో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు చేకూరాలని సంకల్పంతో ఈ సోమయాగాన్ని నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహకులు తెలిపారు.సోమయాగం వల్ల అగ్నిహోత్రం నుంచి వెలువడే ఔషధ పొగల వల్ల వాతావరణంలోని కాలుష్యం తొలగిపోయి సానుకూల శక్తి ప్రసరిస్తుందని, దీనివల్ల ప్రకృతిలో సమతుల్యత ఏర్పడుతుందని వేద పండితులు వివరించారు. యాగాన్ని తిలకించేందుకు భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# చంద్రబాబు పర్యటనకు హెలిప్యాడ్ పరిశీలించిన ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

ఎమ్మార్వో రమాదేవి,సీఐ దస్తగిరి బాబు, ఎస్ఐ మల్లికార్జునతో కలిసి ఏర్పాట్ల పరిశీలన





మంత్రాలయం,శివసూర్య ప్రతినిధి,జూన్ 22:రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 25వ తేదీన మంత్రాలయం నియోజకవర్గానికి విచ్చేయనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతి, సంక్షేమ అభివృద్ధి గురించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి, ఎమ్మార్వో రమాదేవి,సీఐ దస్తగిరి బాబు, ఎస్ఐ మల్లికార్జున, ముఖ్య నాయకులతో కలిసి మంత్రాలయం, మాధవరం, కోసిగి ప్రాంతాల్లో హెలిప్యాడ్, సభా ప్రాంగణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సోదరులు రామకృష్ణ రెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్ నాయుడు, సీనియర్ నాయకులు ముత్తురెడ్డి, గోపాల్ రెడ్డి, యువ నాయకుడు రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జమ్మిచేడు జమ్ములమ్మ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం -- ఆచార్య చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య, జూన్ 22: జమ్ములమ్మ ఆలయం లో రేపు నిర్వహించనున్న ఆధ్యాత్మిక సమావేశానికి హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శంకర్ స్వామీజీ తో పాటు విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఆచార్య సంపర్గ్ ప్రముఖులు, జిల్లా అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు పాల్గొని ఆధ్యాత్మిక సందేశాన్ని అందించనున్నారు.సనాతన ధర్మ పరిరక్షణ, హిందూ ఐక్యత, ధార్మిక చైతన్యం వంటి పలు అంశాలపై జరిగే ఈ సమావేశంలో ప్రతి ఒక్క హిందువు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆచార్య చక్రవర్తి చార్యులు కోరారు.ధర్మాన్ని కాపాడితే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

# భువనగిరి సమావేశానికి హాజరుకావాలని కుల సంఘాలకు విజ్ఞప్తి చేసిన టీఆర్‌పీ పార్టీ నాయకులు



గద్వాల, శివసూర్య, జూన్ 22: జూలై 5వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రజా సమితి .టిఆర్పి ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించనున్న సమావేశానికి జిల్లాలోని అన్ని కుల సంఘాల అధ్యక్షులు, బీసీ వర్గాల ప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా టీఆర్‌పీ పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు మురుగు వీరేష్ చాత్తాద శ్రీ వైష్ణవ సంగం జిల్లా అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యుల కు పార్టీ సమావేశ ఆహ్వాన పత్రికను అందజేశారు.జూలై 5న జరిగే ఈ సమావేశానికి అధిక సంఖ్యలో కుల సంఘాల నాయకులు, బీసీ వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వీరేష్, చక్రవర్తి చార్యులు కోరారు.ఈ కార్యక్రమంలో పులికంటి అశోక్, వీరేష్, ఆంజనేయులు, శంకర్, బుడగ జంగం, అశ్వాపురం మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

# వికాస తరంగిణి డీ.డీ.ఎన్.ఏస్. ఆధ్వర్యంలో చాలీసా విష్ణు సహస్రనామం



జోగులాంబ, శివసూర్య జూన్ 22 గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ భరత్‌నగర్ కాలనీలో వికాస తరంగిణి సభ్యులు జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యుల స్వగృహంలో వికాస తరంగిణి, అర్చక సంఘం మరియు హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, ఆంజనేయ స్వామి దండకం పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువు మరియు ఆంజనేయ స్వామి వారి నామస్మరణలో మునిగిపోయారు. ప్రతిరోజూ చక్రవర్తి చార్యుల స్వగృహంతో పాటు శ్రీలేఖ కిరాణం ప్రాంగణంలో కూడా ఆంజనేయ స్వామి దండకం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించబడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా మరియు ఆంజనేయ స్వామి దండకం పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, ధైర్యం మరియు దైవానుగ్రహం లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు నిత్యం భగవన్నామ స్మరణ చేయాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని ధన్యంగా మార్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, అర్చక సంఘం ప్రతినిధులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# శుద్ధ అష్టమి రోజున శ్రీ గుంటిరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు ఆచార్య




ఐజ, శివసూర్య జూన్ 22 : జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ ఆరవ వార్డు తుపత్రాల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి అధిక జ్యేష్ఠ మాసం ఆరుద్ర కార్తె శుద్ధ అష్టమి సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి పట్టణ మరియు గ్రామప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కేశవ నామాలతో రామానుజాచార్యఅష్టోత్తర శతనామావళి స్మరించుకొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి యొక్క గోవిందం భజగోవిందం హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామావళి అష్టోత్తరాలు పల్లకి సేవతో ఊరేగింపుగా భక్తాదులందరూ భక్తి ప్రపత్తులతో కార్యక్రమాలు నిర్వహించి భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకోవడం జరిగింది. అనంతరం స్వామివారికి కాయ కర్పూరాలు తీర్థప్రసాదాలను సమర్పించుకొని మొక్కులను చెల్లించుకుని అనంతరం ఆలయ అర్చకులు ఆచార్య శ్రీ వైష్ణవం చక్రవర్తి చార్యులు భక్తాదులందరికీ ఆశీర్వచనాలు మంగళా శాసనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు రమేష్ కౌన్సిలర్ మహేశ్వరివెంకన్నగౌడ్ రఘు శంకర్ ఆంజనేయులు వీరేష్ పాండు అమర్ సరస్వతి చిన్నఆంజనేయులు గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# గొర్లఖాందొడ్డిలో ఆధ్యాత్మిక సందేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య చక్రవర్తి చార్యులు




గద్వాల, శివసూర్య, జూన్ 22: జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం గొర్లఖాందొడ్డి గ్రామంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సనాతన ధర్మ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధుసంతులు, శంకర్ స్వామీజీ, జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఆచార్య సంపర్గ్ ప్రముఖ్ ఆచార్య చక్రవర్తి చార్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల కట్టుబాటు, హిందూ సంప్రదాయాల పరిరక్షణ గురించి వివరించారు. పీర్ల పండుగ వంటి అంశాలపై హిందువులు పూర్తి అవగాహనతో తెలుసుకొని, ధర్మానికి అనుగుణంగా ఏది ఆచరించాలో తెలుసుకోవాలని సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకటేష్, రాజారెడ్డి, రామ్ రెడ్డి, గొర్లఖాందొడ్డి గ్రామ ప్రజలు, భక్తాదులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు."సనాతన ధర్మాన్ని కాపాడటం ప్రతి హిందువు బాధ్యత" అని ఆచార్య చక్రవర్తి చార్యులు తెలిపారు.

# వేసవిలో చెరకు రసం తాగితే డీహైడ్రేషన్, ఎండ దెబ్బ రాకుండా ఆపవచ్చా..?



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరాన్ని చల్లబరచేందుకు చాలా మంది సహజంగానే చల్లని పానీయాలవైపు మొగ్గు చూపుతారు. నిమ్మరసం (నీంబూ పానీ), చల్లని లస్సీలు వంటి సంప్రదాయ పానీయాలు తక్షణ ఉపశమనం ఇస్తాయని భావిస్తారు. ఈ జాబితాలో చెరకు రసం (షుగర్‌కేన్ జ్యూస్) కూడా ప్రముఖంగా ఉంటుంది. ఇది సహజంగా తీయగా, తాజాగా అనిపించడంతోపాటు శరీరాన్ని చల్లబరుస్తుందని చాలామంది నమ్మకం. అయితే తీవ్రమైన ఎండలో ఇది నిజంగా హీట్ స్ట్రోక్‌ను నివారిస్తుందా? శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుందా? అనే విషయాలపై చెరకు రసం గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. వాటిని వైద్యులు వివరిస్తున్నారు.

## హైడ్రేషన్ జరుగుతుందా..

హీట్ స్ట్రోక్ అనేది శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించలేని ప్రమాదకర పరిస్థితి. ఇది ముఖ్యంగా డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ లోపం వల్ల వస్తుంది. చెరకు రసం తాగితే చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్‌ను నివారించడానికి అవసరమైన ముఖ్య పోషకాలను అందించదు. చెరకు రసం ఎలక్ట్రోలైట్ డ్రింక్‌లా పనిచేస్తుందని ఒక పెద్ద అపోహ ఉంది. వాస్తవానికి చెమట ద్వారా శరీరం ఒక లీటర్‌కు సుమారు 900 మిల్లీగ్రాముల సోడియంను కోల్పోతుంది. కానీ ఒక గ్లాస్ చెరకు రసంలో కేవలం 11-17 మిల్లీగ్రాముల సోడియం మాత్రమే ఉంటుంది. సోడియం శరీరంలో నీటిని నిల్వ ఉంచడంలో కీలకం. ఇది తక్కువగా ఉంటే హైడ్రేషన్ పూర్తిగా జరగదు. అందుకే చెరకు రసం తాగడం అంటే అసలు శరీరాన్ని హైడ్రేట్ చేయడం కాకుండా చక్కెర నీరు తాగినట్లే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికంటే కొంచెం ఉప్పు కలిపిన నిమ్మరసం తాగడం ఎంతో మేలు చేస్తుంది.

## అధికంగా చక్కెర..

ఇంకో ముఖ్య అంశం చక్కెర పరిమాణం. ఒక గ్లాస్ చెరకు రసంలో సుమారు 25 నుంచి 40 గ్రాముల వరకు చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగితే ఇది మరింత ప్రభావం చూపుతుంది. తాత్కాలికంగా శక్తి ఇచ్చినా, దీర్ఘకాలికంగా హైడ్రేషన్‌కు పెద్దగా సహాయపడదు. హైజీన్ కూడా చెరకు రసం విషయంలో పెద్ద సమస్యగా మారుతుంది. రోడ్డుపై అమ్మే జ్యూస్ స్టాళ్లు ఎక్కువసేపు ఎండలో ఉంటాయి. యంత్రాలు సరిగ్గా శుభ్రం చేస్తారని నమ్మకం ఉండదు. వాడే ఐస్ కూడా శుద్ధి చేసిన నీటితో తయారై ఉండదు. ఈ కారణాల వల్ల ఈ.కోలి, టైఫాయిడ్, జాండిస్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.

## ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళ్లు బెటర్..

అయితే వేసవిలో ఏం తాగాలి? అంటే.. నిపుణుల సూచన ప్రకారం సాదాసీదా నీరు అత్యుత్తమం. దానికి నిమ్మరసం, కొంచెం ఉప్పు కలిపితే శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు అందుతాయి. శరీరంలో నీటిని నిల్వ ఉంచేలా సహాయపడే పానీయాలపై దృష్టి పెట్టడం అవసరం. చెరకు రసం తాగితే తక్షణంగా చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్ నివారణకు లేదా సరైన హైడ్రేషన్‌కు విశ్వసనీయ పరిష్కారం కాదు. తక్కువ సోడియం, ఎక్కువ చక్కెర, హైజీన్ సమస్యల కారణంగా దీన్ని అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవడం మంచిది. వేసవిలో సరైన హైడ్రేషన్ కోసం నిమ్మరసం, ఉప్పు కలిపిన నీరు వంటి సులభమైన పానీయాలు మరింత ప్రయోజనకరంగా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# 60 రోజుల పాటు జంక్ ఫుడ్‌ను మానేస్తే శరీరంలో జరిగే మార్పులు ఇవే..!



జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని చాలా మందికి తెలుసు. అయితే దాన్ని పూర్తిగా 60 రోజుల పాటు మానేస్తే శరీరంలో కనిపించని లోతైన మార్పులు జరుగుతాయి. ప్రాసెస్ చేసిన స్నాక్స్, అధిక చక్కెర ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్‌ను ఆపేసినప్పుడు శరీరం దెబ్బతిన్న వ్యవస్థలను మళ్లీ సరిచేసుకోవడం ప్రారంభిస్తుంది. తాజా పరిశోధనలు తెలిపిన ప్రకారం కొద్ది రోజులపాటు జంక్ ఫుడ్‌కు విరామం వల్ల ఆకలి నియంత్రణ, జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం, మెటబాలిజం మెరుగుపడటానికి దోహదం చేస్తుందని వెల్లడైంది. మొదట కొన్ని వారాలు శుద్ధి దశలా ఉండగా, తర్వాత శక్తి స్థిరంగా మారుతుంది. 60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేస్తే శరీరంలో ఎటువంటి మార్పులు జరుగుతాయో వైద్యులు వివరిస్తున్నారు.

## అతిగా తినడం తగ్గుతుంది..

60 రోజుల పాటు జంక్ ఫుడ్ మానేయడం వల్ల ఆకలి హార్మోన్లు సమతుల్యం అవుతాయి. జంక్ ఫుడ్ వల్ల ఆకలి నియంత్రణ దెబ్బతింటుంది. దీనివల్ల ఎక్కువగా తినే అలవాటు ఏర్పడుతుంది. అయితే 60 రోజుల పాటు దాన్ని మానేస్తే లెప్టిన్, ఘ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు సరిగా పనిచేయడం ప్రారంభిస్తాయి. దాంతో తృప్తి భావం సరిగ్గా తెలుస్తుంది. అలాగే కాలరీలు సహజంగా తగ్గుతాయి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గిస్తే రోజువారీ క్యాలరీలు కూడా ఆటోమేటిక్‌గా తగ్గుతాయి. దాంతో బరువు తగ్గడం, రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడం, శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయి. జంక్‌ఫుడ్ మానేయడం వల్ల గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యం మెరుగుపడుతుంది. జంక్ ఫుడ్ గట్‌లో బ్యాక్టీరియా సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. దాన్ని మానేస్తే గట్ లైనింగ్ మళ్లీ బలపడుతుంది, మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభంగా మారుతుంది. అంతేకాకుండా శరీర మెటబాలిజం మెరుగవుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారం తగ్గించడం వల్ల మెటబాలిజం సరిగా పనిచేస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీని వల్ల శరీరానికి అవసరమైన శక్తి సమర్థంగా ఉత్పత్తి అవుతుంది.

## మెదడు పనితీరుకు..

ఇక జంక్ ఫుడ్ మానేయడం వల్ల మెదడు పనితీరు కూడా మెరుగవుతుంది. జంక్ ఫుడ్ మెదడు పనితీరుపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది మెమొరీ, ఆకలి నియంత్రణపై ప్రభావం చూపుతుంది. 60 రోజుల తర్వాత మెదడు మళ్లీ సరిగా స్పందించడం ప్రారంభించి, ఫోకస్ పెరుగుతుంది, అనవసరమైనవి తినాలనే కోరికలు తగ్గుతాయి. అంతేకాకుండా శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు) తగ్గుతుంది. జంక్ ఫుడ్ వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. ఇది గుండె జబ్బులు, ఇతర సమస్యలకు దారి తీస్తుంది. రెండు నెలలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, చర్మం మెరుగుపడటం, ఉబ్బరం తగ్గడం, కీళ్ల నొప్పులు తగ్గడం వంటి ప్రయోజనాలు కనిపిస్తాయి. 60 రోజులు జంక్ ఫుడ్ మానేయడం కొంచెం కష్టంగా అనిపించినా, శరీరం చాలా త్వరగా ధన్యవాదాలు చెబుతుందని, బయట కనిపించే మార్పుల కంటే లోపల జరిగే మార్పులే ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైనవని నిపుణులు తెలియజేస్తున్నారు.

# పచ్చి మామిడి వర్సెస్ మామిడి పండు.. ఏయే పదార్థాల తయారీకి వేటిని వాడాలి..



మామిడి సీజన్ ప్రారంభమైతే మార్కెట్లు పచ్చి మామిడిపండ్ల నుంచి పండిన తీయని మామిడిపండ్లతో నిండిపోతాయి. ప్రతి ఒక్కరు వారికి నచ్చినవి కొనుగోలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ ఉంటారు. ఈ రెండింటికీ ప్రత్యేకమైన రుచి ఉండడంతోపాటు వంటల్లో వీటి ఉపయోగం కూడా వేరుగా ఉంటుంది. పచ్చి మామిడి తియ్యని, పులుపు రుచిని అందిస్తే, పండిన మామిడి సహజమైన తీపి, మృదుత్వాన్ని అందిస్తుంది. అందువల్ల వీటిని ఒకే పండుగా కాకుండా, వేర్వేరు పదార్థాలుగా చూడటం ఉత్తమం. పచ్చి మామిడి ప్రధానంగా పులుపు, కరకరలాడే టెక్చర్‌తో ఉంటుంది. అందుకే వంటల్లో తాజాదనాన్ని తీసుకురావడానికి ఇది ఉపయోగపడుతుంది. వేసవిలో పచ్చి మామిడి ఉల్లాసాన్ని పెంచే రుచిని అందిస్తుంది. పచ్చి మామిడితో చేసే వంటల్లో ఆవకాయలు, పచ్చళ్ళు ముఖ్యమైనవి. కాయ గట్టిగా ఉండటం వల్ల మసాలాలు, నూనె కలిసిపోతాయి. పచ్చి మామిడి చట్నీలు కూడా భోజనానికి రుచిని పెంచుతాయి.

## ఆమ్ పన్నా ఆరోగ్యకరం..

సలాడ్లు, కచుంబర్‌లలో తురిమిన పచ్చి మామిడి కలిపితే రుచిలో ప్రత్యేకమైన మార్పు వస్తుంది. క్యారెట్, కీరదోసకాయ, పల్లీలు వంటి పదార్థాలతో కలిపితే కరకరలాడే, రుచికరమైన మిశ్రమంగా మారుతుంది. దాల్, కర్రీలలో కూడా పచ్చి మామిడి ఉపయోగిస్తారు. ఇది వంటకానికి తేలికపాటి పులుపును అందించి, రుచిని సమతుల్యం చేస్తుంది. కొబ్బరి ఆధారిత కర్రీల్లో ఇది తేలికపాటి తీపి-పులుపు సమతుల్యతను కలిగిస్తుంది. అలాగే వేసవిలో పచ్చి మామిడితో చేసే పానీయాల్లో ఆమ్ పన్నా ముఖ్యమైనది. ఇది శరీరానికి చల్లదనం ఇవ్వడంతోపాటు తక్షణ శక్తిని అందిస్తుంది. బెల్లం, మసాలాలు కలిపి తయారు చేసే ఈ పానీయం వేసవిలో ప్రత్యేకమైన ఉపశమనాన్ని ఇస్తుంది.

## అల్పాహారంగా పనిచేసే మామిడి పండ్లు..

ఇక పండిన మామిడి తీపి, సువాసన, మృదుత్వంతో వంటల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది. దీన్ని డెజర్ట్‌లోనూ, పానీయాల్లోనూ విస్తృతంగా ఉపయోగిస్తారు. శ్రీఖండ్, కలాకండ్ వంటి మిఠాయిల్లో పండిన మామిడి అద్భుతంగా సరిపోతుంది. మామిడిని క్రీమ్‌తో కలిపినా, కేకులు, మఫిన్స్‌ల్లో వాడినా ప్రత్యేకమైన రుచి ఇస్తుంది. స్మూతీలు, లస్సీలు, బౌల్స్‌లో పండిన మామిడి గట్టిగా, క్రీమీ టెక్చర్‌ను ఇస్తుంది. పెరుగు, పాలు లేదా కొబ్బరితో కలిపి తీసుకుంటే పోషకాహారంగా ఉంటుంది. ఇవి వేసవిలో త్వరగా తయారయ్యే అల్పాహారంగా కూడా ఉపయోగపడతాయి. పండిన మామిడితో సాల్సాలు, టాపింగ్స్ కూడా తయారు చేయవచ్చు. ఉల్లిపాయలు, కొత్తిమీర, నిమ్మరసం, మిరపకాయలతో కలిపితే తీపి-కారం సమతుల్యతతో వంటకానికి కొత్త రుచిని అందిస్తుంది. కొన్ని ప్రాంతీయ కర్రీల్లో కూడా పండిన మామిడి వాడతారు. బెంగాలీ, గోవా వంటల్లో ఇది మసాలాలతో కలిసిపోతూ తేలికపాటి తీపి రుచిని ఇస్తుంది. పచ్చి మామిడి ఉత్సాహం, పులుపు, కరకరలాడే గుణాన్ని ఇస్తే, పండిన మామిడి తీపి, మృదుత్వం, సంతృప్తిని అందిస్తుంది. వంటకానికి అవసరాన్ని బట్టి వీటిని ఎంచుకుంటే ప్రతి వంటకాన్ని ప్రత్యేకంగా మార్చుకోవచ్చు. వేసవి కాలంలో ఈ రెండు రకాల మామిళ్లతో ఎన్నో రుచికరమైన వంటకాలు సిద్ధం చేసుకోవచ్చు.

# ప్రకృతి వ్యవసాయంపై నీతి ఆయోగ్ కరదీపిక

### ప్రకృతి సేద్య పద్ధతులపై ప్రామాణిక శిక్షణా మాన్యువల్‌ను వెలువరించిన నీతి ఆయోగ్

### 22 రకాల పంటల్లో ప్రకృతి సేద్య పద్ధతులపై పూర్తి సమాచారం

### రసాయనిక-సేంద్రియ-ప్రకృతి సేద్యాల మధ్య వ్యత్యాసాలపైనా వివరణ



ప్రకృతి వ్యవసాయాన్ని దేశవ్యాప్తంగా విస్తృతంగా వ్యాప్తిలోకి తేవాలన్న లక్ష్యంతో సమగ్రమైన ట్రైనింగ్ మాన్యువజీల్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ ఇటీవలే వెలువరించింది. 'రైతులకు సాధికారత కల్పించటం: ప్రకృతి వ్యవసాయ శిక్షణా కిట్ -- ఉత్తమ పద్ధతుల మార్గదర్శిని' పేరుతో రూపొందించారు. ప్రకృతి సేద్య మూల సూత్రాలతో పాటు.. ముఖ్యమైన 22 రకాల పంటల సాగులో క్షేత్రస్థాయిలో ఆచరించదగిన ప్రామాణిక ప్రకృతి సేద్య పద్ధతులను పొందుపరిచారు. నీతి ఆయోగ్ వ్యవసాయం--సాంకేతిక విజ్ఞాన విభాగం ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ నీలం పటేల్, కన్సల్టెంట్ పరిమల్ బనఫర్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం దీన్ని రూపొందించింది. రైతులు, విస్తరణ సిబ్బంది, విధాన నిర్ణేతలకు సుస్థిర వ్యవసాయ విస్తరణ దిశా నిర్దేశం చేయటానికి ఈ శిక్షణా మాన్యువల్, ఉత్తమ ప్రకృతి సేద్య పద్ధతులకు అక్షర రూపం ఇచ్చినట్లు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ పేర్కొన్నారు. డాక్టర్ నీలం పటేల్ ఇలా అన్నారు: 'దేశవ్యాప్తంగా రైతులు అనుసరిస్తున్న ప్రకృతి సేద్య పద్ధతులు, ఆవిష్కరణలు, సంప్రదాయ విజ్ఞానంతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రకృతి సేద్య అనుభవాల ఆధారంగా ఈ శిక్షణా మాన్యువల్‌ను రూపొందించాం. దేశంలో సుస్థిర వ్యవసాయాన్ని విస్తరింపజేయటంలో ఇదొక కీలక ముందడుగు'. ప్రకృతి వ్యవసాయ వారసత్వాన్ని సుసంపన్నం చేసిన సుభాష్ పాలేకర్ (మహారాష్ట్ర), ఎల్. నారాయణరెడ్డి (కర్ణాటక), శ్రీపాద దబోల్కర్, జి. నమ్మాళ్వార్ (తమిళనాడు), దీపక్ సచ్‌దే (మధ్యప్రదేశ్), భాస్కర్ సావే (గుజరాత్)ల సేవలను ఇందులో ప్రస్తుతించారు. దేశవ్యాప్తంగా ప్రకృతి సేద్య పథకాలు అమలవుతున్నాయని, 9.4 లక్షల హెక్టార్లలో సుమారు 10 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఇందులో పేర్కొన్నారు.

## అధిక దిగుబడి.. అధిక నికరాదాయం!

వరిని వరుసగా 4 ఏళ్లు ప్రకృతి వ్యవసాయం (ప్ర.వ్య.)లో పండిస్తే 2023 ఖరీఫ్‌లో ఎకరానికి 33.75 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. రసాయన వ్యవసాయం (ర.వ్య.)లో 31.5 క్వింటాళ్లు వచ్చింది. ఈ రెండు ధాన్యాలను క్వింటా రూ.2,040కే విక్రయించారు. ప్ర.వ్య.లో నికరాదాయం రూ.48 వేలు రాగా, రూపాయి ఖర్చుకు 2.3 రూపాయల ఆదాయం ముచ్చింది. ర.వ్య.లో నికరాదాయం రూ.35,140 రాగా, రూపాయి ఖర్చుకు 1.2 రూపాయలు మాత్రమే ఆదాయం వచ్చింది. ప్రధాన పంటలన్నింటిలో సాగు ఖర్చును కనీసం 5--10% తగ్గిస్తుంది. మరికొన్ని పంటల్లో, కొన్ని రాష్ట్రాల్లో 20--55% వరకు తగ్గింది. ˘ప్రకృతి వ్యవసాయం రైతులు, వినియోగదారుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేలల్లో సేంద్రియ కర్బనం 1947లో 2.5% ఉండేది. ఇప్పటికి 0.4%కి తగ్గింది. ప్రకృతి వ్యవసాయం దీన్ని 45% వరకు పెంచుతుంది. ˘నీరు, విద్యుత్‌లో 50--60% ఆదా అవుతుంది. ˘కర్బన ఉద్గారాలను 55--85% తగ్గిస్తుంది. ˘పశువులను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెంచటం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. పంటల వైవిధ్యం, అంతరపంటలు, బహుళ అంచెల పంటలతో వ్యవసాయాదాయ భద్రత, పోషకాహార భద్రత పెరుగు తాయి. రసాయనిక సేద్యం ఏకపంట సాగుతో పోలిస్తే 20--40% అధిక నికర ఆదాయం వస్తుంది.

## జీవామృతం.. 48 గంటలు పులిస్తే చాలు!

జీవామృతం కోసం పేడ, మూత్రం, పప్పుల పిండి, బెల్లం, మట్టిని డ్రమ్ము నీటిలో కలిపిన తర్వాత 2--3 రోజులు పులియబెట్టి పంటలకు వాడుకోడానికి సిద్ధమైనట్లే. కలిపిన 48 గంటల్లో బ్యాక్టీరియా పూర్తిస్థాయిలో వృద్ధి చెందుతుంది. సిద్ధమైన జీవామృతాన్ని వేసవిలో 7 రోజుల వరకు, శీతాకాలంలో 8--10 రోజుల్లో వాడుకోవచ్చని నీతి ఆయోగ్ ప్రకృతి వ్యవసాయ శిక్షణ మాన్యువల్ చెబుతోంది.

## ప్రకృతి సేద్యానికి మార్గదర్శకం

రసాయనిక వ్యవసాయానికి ఒక సుస్థిరమైన ప్రత్యామ్నాయం ప్రకృతి వ్యవసాయం. ఇటు సంప్రదాయ విజ్ఞానాన్ని అటు ఆధునిక పర్యావరణ విజ్ఞానాన్ని ఇముడ్చుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రూపొందాయి. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయంలో ఎదురవుతున్న సవాళ్లకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దీటైన సమాధానాలు ఇవ్వగలవు. తక్కువ వనరులతో, తక్కువ ఖర్చుతోనే వ్యవసాయానికి సుస్థిరత చేకూర్చటం సాధ్యమని ఈ పద్ధతులు చాటి చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా రైతులకు, విస్తరణ సిబ్బందికి ప్రకృతి సేద్య పద్ధతులపై శిక్షణ ఇవ్వటానికి ఈ మాన్యువల్ మార్గదర్శకంగా నిలుస్తుంది.

# వేసవిలో శరీరానికి చల్లదనాన్ని, పోషకాలను అందించే అద్భుతమైన పానీయం ఇది.. ఎలా తయారు చేయాలంటే..?



వేసవి కాలం ప్రారంభమయ్యాక చల్లని పానీయాలు రోజువారీ జీవితంలో భాగమవుతాయి. మార్కెట్‌లో రెడీమేడ్ డ్రింక్స్, మిక్స్‌లు సులభంగా లభిస్తున్నప్పటికీ, సంప్రదాయ భారతీయ పానీయాలకు ప్రత్యేక స్థానం ఇప్పటికీ ఉంది. అలాంటి ప్రసిద్ధ పానీయాల్లో తండాయి ఒకటి. ఇది రుచితోపాటు శరీరాన్ని చల్లబరచే గుణాల వల్ల ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. సాధారణంగా హోలీ పండుగ సమయంలో ఎక్కువగా తయారుచేసే తండాయి, వేసవి మొత్తం తాగడానికి అనువైన పానీయం. పాలు, డ్రై ఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలు, గులాబీ రేకులు, కుంకుమపువ్వు కలిపి తయారు చేసే ఈ పానీయం శరీరానికి శక్తిని అందించడమే కాకుండా, తాగిన వెంటనే తాజాగా అనిపించేలా చేస్తుంది. ఇంట్లో తండాయి మసాలా తయారు చేసుకోవడం వల్ల మనకు కావలసిన రుచులు, తీపి స్థాయి అన్నీ మనమే నియంత్రించుకోవచ్చు.

## ఇలా చేయాలి..

ఇంట్లో తండాయి మసాలా తయారీ చాలా సులభం. బాదం, జీడిపప్పు, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్‌తో పాటు సోంపు, గసగసాలు, యాలకులు, మిరియాలు వంటి సుగంధ ద్రవ్యాలు ప్రధానంగా ఉపయోగిస్తారు. వీటితోపాటు గులాబీ రేకులు, కుంకుమపువ్వు కూడా ప్రత్యేక సువాసనను ఇస్తాయి. తయారీ విధానంలో మొదట అన్ని డ్రై ఫ్రూట్స్, గింజలను శుభ్రంగా కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. తేమ లేకుండా ఉండేలా చూసుకోవాలి. తరువాత యాలకులు, మిరియాలు, సోంపు, గసగసాలు మొదటగా మెత్తగా పొడి చేయాలి. తరువాత బాదం, జీడిపప్పు, పిస్తా, మెలన్ గింజలను వేసి కొద్దిగా దట్టంగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఆ తరువాత గులాబీ రేకులు, కుంకుమపువ్వు వేసి మరోసారి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమం సువాసనతో కూడిన మసాలాగా తయారవుతుంది. పూర్తిగా చల్లారిన తరువాత గాలి చొరబడని సీసాలో నిల్వచేస్తే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటుంది.

## చల్లని పాలలో కలిపి..

ఈ మసాలాతో తండాయి తయారు చేయడం కూడా చాలా ఈజీ. చల్లని పాలలో ఒకటి లేదా రెండు టీస్పూన్లు మసాలా కలిపి, అవసరమైతే చక్కెర వేసి బాగా కలిపి సర్వ్ చేస్తే చాలు. ఇది శరీరాన్ని లోపల నుంచి చల్లబరచడంలో సహాయపడుతుంది. ఇంట్లో తయారు చేసిన తండాయి మసాలా సహజమైన రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అయితే ఇది తీపి ఎక్కువగా ఉండే పానీయం కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## కోచింగ్ సెంటర్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 14మంది మృతి




లక్నో: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 14మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో అలీగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉషా మెహతా మార్గ్‌లో ఉన్న మూడంతస్తుల వాణిజ్య భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఒక దుకాణంలో ప్రారంభమైన మంటలు, షార్ట్ సర్క్యూట్ కారణంగానే వ్యాపించి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ మంటలు క్షణాల్లోనే పై అంతస్తులకు విస్తరించాయి. ఆ సమయంలో రెండో, మూడో అంతస్తుల్లో నడుస్తున్న కంప్యూటర్ కోచింగ్ సెంటర్, లైబ్రరీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. భవనం మొత్తం దట్టమైన పొగలు, మంటలు అలుముకోవడంతో లోపల ఉన్న విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బయటకు వచ్చే మార్గం మూసుకుపోవడంతో, ఊపిరాడక కొందరు కేకలు వేశారు. ప్రాణభయంతో కొందరు విద్యార్థులు భవనం మొదటి, రెండో అంతస్తుల కిటికీలు, రైలింగ్‌ల నుండి కిందకు దూకారు. ఈ క్రమంలో ఒక యువకుడు కిందపడి తీవ్రంగా గాయపడగా, అక్కడ తీవ్ర తొక్కిసలాట కూడా చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే లక్నో చీఫ్ ఫైర్ ఆఫీసర్ నేతృత్వంలో 14 అగ్నిమాపక శకటాలు, ఒక హైడ్రాలిక్ ప్లాట్‌ఫారమ్ వాహనం ఘటనా స్థలానికి చేరుకున్నాయి. పోలీసులు, స్థానికులు కలిసి సహాయక చర్యలు చేపట్టారు. భవనం లోపల చిక్కుకున్న ఐదారు మందిని స్థానికులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అయితే, మంటలు భారీగా ఉండటంతో లోపలికి వెళ్లడం అగ్నిమాపక సిబ్బందికి కష్టతరంగా మారింది. నిచ్చెనల సహాయంతో కిటికీలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అయితే ఘోరం జరిగిన సమయంలో 11మంది ప్రాణాలు కోల్పోగా.. మృతుల సంఖ్య 14కిచేరింది. ఈ ఘోర ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన బాధితులకు తక్షణమే సమీప ఆసుపత్రుల్లో చేర్చి మెరుగైన ఉచిత వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

## వ్యక్తిని చంపి బూడిదైన ఇవ్వరా?: కన్నబాబు




కాకినాడ: ఒక వ్యక్తిని చంపి అతని బూడిదకూడా కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం అత్యంత బాధాకరమైన విషయమని వైఎస్సార్సీపీ నేత మాజీ మంత్రి కన్నబాబు అన్నారు. సాయికృష్ణ కేసుపై కాకినాడలో ఆయన ఈ రోజు ( సోమవారం) మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సొంత రాజ్యాంగం అమలు చేస్తోందని దుయ్యబట్టారు. సాయికృష్ణ, క్రాంతికుమార్ మరణాలపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని ఇటీవల జరిగిన ఐదుగురి హత్యలు పోలీసుల చేసిన హత్యలేనన్నారు. సాయికృష్ణపై కూటమి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా ఎమ్మెల్యే పంతం నానాజీ సంస్కార హీనంగా దిగజారి మాట్లాడుతున్నారన్నారు. పంతం నానాజీ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి పంతం నానాజీకి లేదు. ఆ విషయం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీనైనా నెరవేర్చిందా అని ప్రశ్నించారు.? కాపుల గురించి మాట్లాడిన నేతలపై నీచంగా మాట్లాడితే ఎ?ట్టిపరిస్థితుల్లో సహించేది లేదన్నారు. ఎల్లకాలం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండదని ఆవిషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతో భరోసా బాధితులు అధికంగా కాపు నేతలే ఉన్నారని ఈ అంశంలో కాపు నేతలంతా కలిసి మాట్లాడుకుంటే మీకొచ్చిన నొప్పేంటి అని ప్రశ్నించారు. కాపులకు జరుగుతున్న అన్యాయాల గురించి కూటమి నేతలు ఎందుకు మాట్లాడరని మాజీ మంత్రి కన్నబాబు ప్రశ్నించారు.

## రాష్ట్రంలో భారీ వర్షం.. వాతావరణ శాఖ హెచ్చరికలు



విశాఖ : వాతావరణ శాఖ రాష్ట్రానికి భారీ వర్ష సూచన జారీ చేసింది. కాకినాడ,అల్లూరి, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో రాష్ట్రవ్యాప్తంగా మోస్తారు వానలు ఉండే అవకాశాలున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఉత్తరప్రదేశ్ నుంచి రాయలసీమ మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో ఈ వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వానలు లేని చోట ఎండల తీవ్రత సైతం అధికంగా ఉండనున్నట్లు పేర్కొంది.

## తిరుపతి రోడ్డు ప్రమాదంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి: తిరుపతి జిల్లా రోడ్డు ప్రమాదంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుమువారిపల్లె వద్ద ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో చిన్నారి పునీత్ సాయి, విద్యార్థిని యస్విత మృతి చెందడం అత్యంత విషాదకరమని వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం కలచివేసిందని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి దేవుడు ప్రసాదించాలని ప్రార్థించారు. అదేవిధంగా ఈ ప్రమాదంలో గాయపడిన వారందరికీ అత్యవసరంగా మెరుగైన వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి, తగిన సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

లండన్ : బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేశారు. లేబర్ పార్టీ నేతగా కూడా రిజైన్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే తమ పార్టీకి కొత్త నేతను ఎంపిక చేసే వరకు తాత్కాలికగా ప్రధానిగా స్టార్మర్ కొనసాగనున్నారు. మరికొన్ని వారాల్లో కొత్త నేతను ఎన్నుకోనున్నారు. 2024లో ఆయన నేతృత్వంలో లేబర్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించింది. కానీ రెండేళ్లలోనే ఆయనతో పాటు పార్టీ పాపులారిటీ కూడా తగ్గిపోయింది. గత వారం జరిగిన ఎన్నికల్లో ఆండీ బర్న్‌హమ్ .. ప్రత్యేక ఎన్నికల్లో గెలిచారు. గ్రేటర్ మాంచెస్టర్ మాజీ మేయర్ అయిన ఆయన. లేబర్ పార్టీ నాయకత్వ పాత్రకు పోటీపడనున్నారు. రెండేళ్ల క్రితం డౌనింగ్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇవ్వడం జీవితంలో గర్వించదగ్గ సందర్భం అని తెలిపారు. ప్రజల జీవితాలను మెరుగుపరుచాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి ప్రవేశించినట్లు ఆయన చెప్పారు. దేశ ఆర్థిక, రక్షణ వ్యవస్థను పునరుత్తేజం చేసినట్లు స్టార్మర్ తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా దివాళా తీసిన లేబర్ పార్టీకి జీవం పోశానన్నారు. పార్టీ పని అయిపోయిందన్న వారికి.. ఆ వ్యాఖ్యలు తప్పు అని నిరూపించారన్నారు. రాజీనామాపై ఇవాళ ఉదయం బ్రిటన్ రాజుతో చర్చించినట్లు ఆయన చెప్పారు. లేబర్ పార్టీ నాయకత్వం కోసం నామినేషన్లు స్వీకరించాలని చెప్పానన్నారు. అయితే సెప్టెంబర్‌లో కొత్త నేత వచ్చే వరకు స్టార్మర్ తాత్కాలిక ప్రధానిగా చేయనున్నారు.

# ఈ-20... మనకేంటి?

- పెట్రోల్‌లో ఇథనాల్ కలపటం వల్ల లాభనష్టాలివీ...
- దిగుమతుల బిల్లు తగ్గి... రూపాయిపై ఒత్తిడి తగ్గుతుంది
- చెరకు రైతులకు మరో ఆదాయం... గ్రామాల్లో కొత్త ఎకానమీ
- డిస్టిలరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, మరిన్ని లాజిస్టిక్స్ సౌకర్యాలు
- కాకపోతే 2023కు ముందటి వాహనాలకు కాస్త ఇబ్బందే
- దీర్ఘకాలంలో ఇంజిన్ సిస్టమ్ దెబ్బతినే అవకాశం
- ఇథనాల్ వల్ల పికప్ పెరిగినా... మైలేజీ తగ్గుతుంది
- మార్కెట్లోకి ఈ--85 ఫ్లెక్స్ ఇంధనం; రూ.20 తగ్గుదల
- దీన్ని వాడటానికి కొత్తగా ఫ్లెక్స్ వాహనాలు
- మైలేజీతో పోలిస్తే డిస్కౌంట్‌తో లాభం సున్నా

ఇథనాల్!!. దీనిచుట్టూ ముఖ్యమైన ఆర్థికాంశాలున్నాయి. దాన్ని మించిన రాజకీయాలున్నాయి. వీటన్నిటినీ మించిన ప్రచార హోరు ఉంది. సరే! మరి వాస్తవాలేంటి? ఈ--20, ఈ--30 నుంచి మనమిప్పుడు ఈ--85కు వచ్చేశామని కేంద్రం ఘనంగా ప్రకటిస్తోంది. అంటే... 85 శాతం ఇథనాల్, మిగిలిన 15 శాతం పెట్రోల్ కలిపి వాహనాల్లో ఇంధనంగా వాడతారన్న మాట. మరి ఇలా వాడటం వల్ల ఎవరికెంత లాభం? ఎవరికెంత నష్టం? మన వాహనాలు వీటన్నిటికీ రెడీయేనా? ఇదంతా కేవలం ప్రభుత్వ దిగుమతి బిల్లు తగ్గించుకోవటానికేనా? పర్యావరణ హితమని చెబుతున్నదాంట్లో నిజమెంత? ఇవన్నీ వివరించేదే ఈ ప్రత్యేక కథనం..

రూపాయి పతనాన్ని అడ్డుకోవాలన్నా... డాలర్ కాస్త దిగిరావాలన్నా మొదట మనం చమురు, బంగారం దిగుమతులు తగ్గించుకోవాలి. పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపేసి విక్రయించటం మొదలుపెట్టింది కూడా అందుకే. నిజానికి ఇథనాల్ బ్లెండింగ్ 2001లో మొదలైంది. ప్రయోగాత్మకంగా కొన్ని రాష్ట్రాల్లో మొదలై... రకరకాల దశలు దాటుతూ చివరకు 2014 నాటికి బ్లెండింగ్ 2 శాతానికి చేరింది. అప్పట్లో ఇథనాల్ ఉత్పత్తి భారీగా లేకపోవటమూ దీనిక్కారణమే. కానీ తరవాత కేంద్రం వేగంగా కదిలి.. ఉత్పత్తిని పెంచే చర్యలు తీసుకోవటంతో ఇపుడు పెట్రోల్‌లో ఇథనాల్ 20 శాతానికి చేరిపోయింది. ఇపుడు దేశంలో ఏకంగా రోజుకు 20 బిలియన్ లీటర్ల ఇథనాల్ ఉత్పత్తవుతోంది. దీనిలో 12 బిలియన్ లీటర్లను మాత్రమే ఈ--20 రూపంలో కలపగలుగుతున్నారు. మిగిలిన ఇథనాల్‌ను కూడా వాడకంలోకి తెచ్చేందుకే ఇపుడు ఏకంగా ఈ--85 అంటూ ఫ్లెక్స్ ఇంధనాన్ని అమల్లోకి తెచ్చారు. దీనికోసం పలు కంపెనీలు ఫ్లెక్స్ వాహనాలను కూడా తయారు చేయటం మొదలెట్టాయి.

### జనం ఆందోళనేంటి? అందులో నిజమెంత?

ఈ--85 ఫ్లెక్స్ ఇంధనాన్ని దానికోసం ప్రత్యేకంగా రూపొందించిన ఫ్లెక్స్ వాహనాల్లో వాడతారు కనక ఇబ్బందులుండవు. కానీ ఈ--20 అనేది చాలా వేగంగా సాధించిన బ్లెండింగ్. ఈ బ్లెండింగ్ పెరిగినంత వేగంగా దాన్ని తట్టుకునే వాహనాలను కంపెనీలు తయారు చేయలేదు. 2023 ఏప్రిల్ నుంచీ ఈ--20 మిశ్రమాన్ని తట్టుకునే వాహనాలనే తయారు చేయాలని కేంద్రం నిబంధనలు తెచ్చింది. 2025 నుంచి ఈ--20ని మరింత సమర్థంగా మార్చే వాహనాల్ని తయారు చేయాలని కేంద్రం ఆదేశాలిచ్చింది. ఇదంతా బాగానే ఉంది. కానీ 2023కు ముందు రోడ్లపైకి వచ్చిన వాహనాల సంగతేంటి? అవి ఈ--20ని తట్టుకోగలవా? వాహనాలు పాడైపోవా? జవాబుదారీ ఎవరిది? ఇదే జనం ఆందోళన. వాటిలో నిజానిజాలేంటో ఒకసారి చూద్దాం...

### ఈ--10 వరకూ ఫర్వాలేదు...

ఈ--10 వరకూ ఏ వాహనమైనా ఓకే. ప్రపంచవ్యాప్తంగా వాహనాలన్నీ ఈ--10తో పెద్ద సమస్యలు లేకుండానే నడుస్తున్నాయి. వాహనాల జీవితకాలం పెద్దగా తగ్గటమంటూ ఉండదు.




### ఈ--20.. ఆధునిక వాహనాలైతే ఓకే...

వీటికోసం ప్రత్యేకంగా తయారు చేసిన వాహనాలైతే (2023 ఏప్రిల్ తర్వాత వచ్చినవి) ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. ఎందుకంటే వాహనాల ఫ్యూయల్ పంప్‌లను, ఇంజెక్టర్లను, ఫ్యూయల్ లైన్స్‌ను, ఇంజిన్ కాలిబరేషన్‌ను కంపెనీలు మార్చాయి. కానీ ఇలా మార్చని వాహనాల్లో ఈ--20 వాడితే కొంత ఇబ్బందేనన్నది నిపుణుల మాట. ట్యాంకు, పంపు, పైపులు, ఇంజెక్టర్లు, రబ్బర్ సీల్స్‌తో కూడిన ఇంజిన్ సిస్టమ్ దీర్ఘకాలంలో అరిగి దెబ్బతినే అవకాశాలు ఎక్కువన్నది వారి వార్?నంగ్.

### ఈ--85, ఈ--100... ఫ్లెక్స్ వాహనాలకే

ఈ ఇంధనాన్ని వాడాలంటే ఫ్లెక్స్ ఫ్యూయల్ టెక్నాలజీ ఉన్న వాహనాలు కావాలి. సాధారణ వాహనాల్లో ఈ ఇంధనం వాడలేం. దీనికి విభిన్నమైన ఫ్యూయల్ మ్యాపింగ్, సెన్సర్లు, భిన్నమైన భాగాలుంటాయి కనక ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. ఈ రకం వాహనాలను ఇప్పటికే బ్రెజిల్‌లో లక్షల కొద్దీ వాడుతున్నారు. మన దేశంలోనూ పలు కంపెనీలు ప్రత్యేక ఫ్లెక్స్ వాహనాలను తయారు చేసి ఇప్పటికే విడుదల చేశాయి.

### పికప్, మైలేజీ సంగతేంటి?

ఇథనాల్‌ను పెట్రోల్‌తో పోలిస్తే ఆక్టేన్ రేటింగ్ ఎక్కువ. దీంతో ఇంజిన్ న్యాకింగ్‌ను బాగా తట్టుకుంటుంది. సామర్థ్యం ఎక్కువ. పికప్ బాగుంటుంది. కాకపోతే మైలేజీ మాత్రం పెట్రోల్‌తో పోలిస్తే తక్కువే. ఎందుకంటే పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్‌లో 30-- 35 శాతం ఎనర్జీ తక్కువ. దీనివల్ల ఈ--20 అయితే 3--8 శాతం... ఈ--85 అయితే 20--30 శాతం, ఈ--100 అయితే 25--35 శాతం మైలేజీ పడిపోయే అవకాశం ఎక్కువ. అంటే ఇథనాల్‌తో మైలేజీ తగ్గటమన్నది వాస్తవం. ఇక ఇంజిన్ విషయానికొస్తే కొత్త వాహనాలకైతే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. 2023కు ముందు వాహనాలైతే కొన్ని సమస్యలు ఎదుర్కోక తప్పదన్నది నిపుణుల మాట. పైపెచ్చు ఇథనాల్ గాలి నుంచి ఎక్కువ తేమను లాక్కుంటుంది. దీనివల్ల దీర్ఘకాలం వాడకుండా ఉంచితే పనిచేయటం మానేయొచ్చు. బోట్లు, జనరేటర్లలోనూ సమస్యలు ఎక్కువ వస్తుంటాయి.

### లాభమెవరికి... నష్టమెవరికి?

దిగుమతుల కోసం భారీగా డాలర్లు వెచ్చిస్తున్న మన కేంద్ర ప్రభుత్వానికి ఇథనాల్ కాస్త ఊరటనే చెప్పాలి. దీనివల్ల కొంతయినా దిగుమతుల బిల్లు తగ్గుతోంది. చెరకు రైతులకూ కొంతవరకూ లాభమే. గ్రామాల్లో డిస్టిలరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు వస్తాయి. లాజిస్టిక్స్ అవసరాలు పెరుగుతాయి. కాకపోతే... భారీగా చెరకు, జొన్న, ఆహారధాన్యాలు అవసరమవుతాయి. పైపెచ్చు చెరకు పంటకు విపరీతమైన నీటి వనరులు కావాలి. భారీగా పండించాలంటే భారీగా జలవనరులూ కావాలి. ఇదే పలువురి ఆందోళనకు కారణమవుతోంది. పంటలను ఆహారానికి ఖర్చు చేయాలా? ఇంధనానికి ఖర్చు చేయాలా? అన్న చర్చ కూడా మొదలైంది. వీటన్నిటికీ కేంద్రం సరైన సమాధానం చెప్పగలిగినప్పుడే ఇథనాల్ ఎకానమీ ప్రశాంతంగా ముందుకెళుతుంది.

### ఇదీ... ఫ్లెక్స్ ఎకానమీ

ఈ--85 ఇంధనాన్ని ఈ--20 కన్నా లీటరుకు రూ.20 తగ్గించి విక్రయిస్తున్నారు. దీన్నో ఆకర్షణీయ డిస్కౌంట్‌గా ప్రభుత్వం చెబుతున్నా... తగ్గుతున్న మైలేజీతో పోలిస్తే ఈ డిస్కౌంట్ వల్ల ఏమాత్రం లాభం లేదన్నది సామాన్యుల మాట. ప్రభుత్వం మాత్రం ఈ ఏడాది చివరి నాటికి ఈ--85 ఇథనాల్ స్టేషన్లను 500 ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ సంఖ్యను 5వేలకు చేర్చాలనేది లక్ష్యం. ఇక వాహన తయారీ కంపెనీలు ఇప్పటికే మార్కెట్లోకి కొత్త మోడళ్లు తెచ్చేశాయి. మారుతీ సుజుకీ వ్యాగన్--ఆర్, హీరో సంస్థ స్ప్లెండర్, హీరో హెచ్ఎఫ్ డీలక్స్‌లో ఫ్లెక్స్ మోడళ్లు తెచ్చాయి. మిగిలిన కంపెనీలూ పలు మోడళ్ల తయారీలో ఉన్నాయి.

### ఏంటీ ఇథనాల్? ఎలా వస్తుంది?

ఇథనాల్ అంటే... చక్కెరలు, పిండిపదార్థాలు పులియబెట్టడం ద్వారా తయారయ్యే ఆల్కహాల్. సాధారణంగా చెరకురసం, చక్కెర పరిశ్రమలో వచ్చే మొలాసిస్, జొన్న, పాడైన ఆహారధాన్యాలు, వరి, గోధుమ, వ్యవసాయ వ్యర్థాల నుంచి దీన్ని తయారు చేస్తుంటారు.

### స్టాక్ మార్కెట్లో లబ్ధిదారులు ఎవరు?

భారత్‌లో ఇథనాల్ మిశ్రమ ఇంధనాల (ఈ20, ఈ85, ఈ100) వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ఇథనాల్ సంబంధిత కంపెనీలు సమానంగా లాభపడవు. కొన్ని ప్రత్యక్షంగా, మరికొన్ని పరోక్షంగా ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

### ఇథనాల్ ఉత్పత్తి కంపెనీలు

### బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్

దేశంలోని అతిపెద్ద ఇథనాల్ ఉత్పత్తిదారుల్లో ఒకటి. భారీ స్థాయిలో డిస్టిలరీల విస్తరణ. చక్కెర, ఇథనాల్ వ్యాపారాల సమీకరణ చేస్తుంది. ఇథనాల్ డిమాండ్ పెరిగితే అత్యధికంగా లాభపడే కంపెనీల్లో ఇది ముందుంటుంది.

### ప్రజ్ ఇండస్ట్రీస్

ఇథనాల్ ప్లాంట్ల రూపకల్పన, నిర్మాణంలో నైపుణ్యం. ఏ కంపెనీ కొత్త ప్లాంటు నిర్మించినా ఆర్డర్లు పొందే అవకాశం.రెండో తరం (2జీ) ఇథనాల్ టెక్నాలజీలో కూడా కీలక పాత్ర. దేశ ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 20 బిలియన్ లీటర్ల నుంచి 30 బిలియన్ లీటర్లకు పెరిగితే ప్రజ్‌కు భారీ అవకాశాలు ఉండొచ్చు.

### త్రివేణి ఇంజినీరింగ్

చక్కెర. డిస్టిలరీలు, ఇథనాల్ ఈ మూడు రంగాల్లోనూ ఉనికి ఉండడం వల్ల లాభాలు పొందే అవకాశం ఉంది.

దాల్మియా భారత్ షుగర్

లిస్టెడ్ షుగర్ కంపెనీల్లో ఇథనాల్‌పై ఎక్కువ దృష్టి పెట్టిన సంస్థల్లో ఒకటి.

శ్రీ రేణుక షుగర్స్

చక్కెర, ఇథనాల్ రంగాల్లో బలమైన స్థానం కలిగిన కంపెనీ.

మొక్కజొన్న ఆధారిత ఇథనాల్ కంపెనీలు

నీటి కొరత కారణంగా భవిష్యత్తులో చెరకు కంటే మొక్కజొన్న (మైజ్) ఆధారిత ఇథనాల్‌కు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది.

గుజరాత్ అంబుజా ఎక్స్‌పోర్ట్స్ -- మొక్కజొన్న ప్రాసెసింగ్‌లో బలమైన ఉనికి.

సుఖ్‌జిత్ స్టార్చ్ అండ్ కెమికల్స్

చమురు మార్కెటింగ్ కంపెనీలు:

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్

భారత్ పెట్రోలియం కార్పొరేషన్

హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్

ఇవి ఈ 85, ఈ100 ఇథనాల్ ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తాయి. ఇథనాల్ నిల్వలు, రవాణా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తాయి. అయితే వీటి మొత్తం ఆదయాంలో ఇథనాల్ వాటా తక్కువే కావడం వల్ల ప్రభావం పరిమితంగానే ఉండే అవకాశముంది.

ఆటో మొబైల్ కంపెనీలు

మారుతీ సుజుకీ

దేశంలో తొలి ఫ్లెక్స్--ఫ్యూయల్ ప్యాసింజర్ కారును ప్రవేశపెట్టింది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ముందుగానే సన్నద్ధమవుతోంది.

హీరో మోటోకార్ప్

భారత్ ప్రధానంగా ద్విచక్ర వాహనాల మార్కెట్ కావడంతో మంచి అవకాశాలు ఉన్నాయి.

బజాజ్ ఆటో

భవిష్యత్తులో ఫ్లెక్స్--ఫ్యూయల్ వాహనాలను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

ఇవన్నీ దీర్ఘకాల పెట్టుబడిదారులకు ఆసక్తికరమైన ఎంపికలే..ఇంకా ఇథనాల్ తయారీదారులతో పాటు డిస్టిలేషన్ పరికరాల తయారీ, నిల్వ ట్యాంకులు, ఇన్‌ఫ్రా, బయోఫ్యూయెల్, ధాన్యం ప్రాసెసింగ్ కంపెనీలకూ లాభమే.

భారత్‌లో ఈ--20 అమల్లో ఉంది. అంటే మనకు వస్తున్న పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపి విక్రయిస్తున్నారు.

బెజిల్ ఎప్పటి నుంచో ఈ--85. ఈ--100ని విక్రయిస్తోంది.

# అతడు అరవడు.. హంగామా చేయడు.. సునామీలా ప్రభావం చూపిస్తాడు!

రాజకీయాల్లో విజయానికి పెద్ద పెద్ద సభలు, ఘాటు విమర్శలు, నిత్యం వార్తల్లో ఉండే హడావిడి తప్పనిసరి కాదని నిరూపించిన నాయకుడు విజయ్. వెండితెరపై స్టార్‌గా కోట్లాది అభిమానులను సంపాదించిన ఆయన.. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా అదే నిశ్శబ్ద శైలిని కొనసాగించారు. కానీ ఆ మౌనం బలహీనత కాదు!. విమర్శలు, అవమానాలు, వ్యక్తిగత విషాదాలు, ఎన్నో ఒడిదొడుకులను దాటుకుంటూ ఆయన ఈ స్థాయికి వచ్చారు. బయటకు కనిపించే విజయ్ కథ ఒకటైతే.. ఆయన విజయానికి పునాది వేసిన మరో కథ ఉంది. చాలా మందికి తెలియని ఆ ప్రయాణం పరిశీలిస్తే.. తమిళ సినీ దర్శకుడు ఎస్.ఏ. చంద్రశేఖర్, శోభ దంపతుల కుమారుడిగా సినీ కుటుంబంలో జన్మించిన విజయ్, చిన్న వయసులోనే కెమెరా ముందుకు వచ్చారు. అయితే ఆయన బాల్యం పూర్తిగా ఆనందంగా సాగిపోలేదు. విజయ్‌కు ఎంతో ఇష్టమైన సోదరి విద్య చిన్న వయసులోనే అనారోగ్యంతో మరణించింది. ఆ ఘటన విజయ్‌ను తీవ్రంగా కలచివేసిందని ఆయన కుటుంబ సభ్యులు పలుమార్లు చెప్పారు. సోదరి మరణం తర్వాత విజయ్ మరింత మౌనంగా మారిపోయారని, తన భావోద్వేగాలను బయటకు వ్యక్తపరచడం తగ్గించారని చెబుతుంటారు. నేటికీ ఆయన నిర్మించిన కొన్ని సంస్థలు, సేవా కార్యక్రమాల్లో 'విద్య' పేరు కనిపించడం ఆ అనుబంధానికి నిదర్శనం. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్‌ను ప్రారంభించిన విజయ్.. హీరోగా మారిన తొలి రోజుల్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. నటన రాదని, స్టార్ మెటీరియల్ కాదని, తండ్రి అండతో మాత్రమే అవకాశాలు వస్తున్నాయని విమర్శకులు ఎద్దేవా చేశారు. కానీ విజయ్ ఎప్పుడూ మాటలతో సమాధానం ఇవ్వలేదు. ప్రతి సినిమాతో తనను తాను నిరూపించుకుంటూ ముందుకు సాగారు. అదే ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. కాలక్రమంలో తమిళ సినీ పరిశ్రమలో అగ్రనటుడిగా ఎదిగిన విజయ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది కేవలం స్టార్‌డమ్ కాదు.. ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధం. విద్యార్థులకు ప్రోత్సాహం, పేదలకు సాయం, ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలను ఆయన నిశ్శబ్దంగానే కొనసాగించారు. ముఖ్యంగా అభిమాన సంఘాలను సేవా కార్యక్రమాల వైపు మళ్లించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు




పొందారు. తమిళుల ఆత్మగౌరవం, భాష, సంస్కృతి, యువత భవిష్యత్తు వంటి అంశాలపై ఆయన తీసుకున్న వైఖరి ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. జల్లికట్టు ఉద్యమం నుంచి వివిధ ప్రజా సమస్యల వరకు తన మద్దతును వ్యక్తం చేస్తూ యువతకు మరింత చేరువయ్యారు. ఈ క్రమంలో స్టార్‌డమ్‌ను పరిగణనలోకి తీసుకుని.. ముసుగులేసుకుని మరీ ఆయన ఆయా వేదికల వద్దకు వెళ్లేవారు. ఇక.. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆయన శైలి మారలేదు. అవసరమైనప్పుడు మాత్రమే మాట్లాడటం, చెప్పాల్సిన విషయాన్ని సూటిగా చెప్పడం, ప్రజల మధ్య నిశ్శబ్దంగా పని చేయడం ఆయన బలంగా మారింది. విజయ్ వ్యక్తిత్వంలో మరో ఆసక్తికర కోణం కూడా ఉంది. బయటకు కనిపించేంత హడావిడి ఆయన జీవితంలో ఉండదు.

సినిమా వేడుకలు, వ్యక్తిగత కార్యక్రమాలు, రాజకీయ సమావేశాల్లో కూడా అవసరమైనంత మేరకే కనిపిస్తారు. అందుకే ఆయనను దగ్గరగా చూసిన వారు 'రిజర్వ్' వ్యక్తిగా అభివర్ణిస్తుంటారు. కానీ ప్రజల సమస్యల విషయంలో మాత్రం తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పడంలో వెనుకాడరు. అందుకే విజయ్ కథ కేవలం ఓ సినీ హీరో సీఎం అయిన కథ కాదు. వ్యక్తిగత విషాదాలను అధిగమించి, విమర్శలను అవకాశాలుగా మలుచుకుని, మౌనాన్నే తన బలంగా మార్చుకున్న వ్యక్తి కథ. అందుకే అభిమానులు ఆయన గురించి ఒక్క మాట చెబుతారు... "ఆయన కొందరిలా అరవడు.. హంగామా చేయడు.. సినీ ప్రత్యర్థులపై నోటికి వచ్చినట్లు మాట్లాడడు.. రాజకీయాల్లో ఇష్టానుసారం విమర్శలు చేస్తూ ఊగిపోడు.. సైలెంట్ సునామీలా ప్రభావం మాత్రమే చూపిస్తాడు!".

## పవన్ కల్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ హావభావాలు, ఆయన మాట్లాడుతున్న విధానంపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్, ట్రోల్స్ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ శతాబ్దపు మోస్ట్ కామిక్ పర్సన్ పవన్ కల్యాణ్ అని, ఆయన సినిమాల్లో కంటే నిజ జీవితంలోనే అత్యంత అద్భుతంగా నటిస్తున్నారని విమర్శించారు. పదిమందిలో మాట్లాడుతున్నామనే కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని, ఆయన ఉప ముఖ్యమంత్రి కాకుండా ఉంటే ప్రెస్ మీట్లో ఆయన మాటలకు నా పీఏ కూడా స్పందించడని అన్నారు. అసలు ఆయన వెంట ఒక సామాజిక వర్గం కళ్లు మూసుకుని ఎలా నడుస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదని అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత రాజకీయాలను ప్రస్తావిస్తూ.. 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మరి దానిపై పవన్ కల్యాణ్ ఎందుకు నోరు మెదపరని శ్రవణ్ కుమార్ నిలదీశారు. ముఖ్యంగా సంచలనం రేపిన 'సుగాలి ప్రీతి' కేసును పవన్ డీల్ చేస్తున్న తీరుపై ఆయన లీగల్ పాయింట్స్ లేవనెత్తారు. సుగాలి ప్రీతి అసలు ఏ సంవత్సరంలో చనిపోయిందో కూడా కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఈ కేసు విషయంలో 'భౌభౌ' అని అరిచిన పవన్ కల్యాణ్ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారని జడ శ్రవణ్ మండిపడ్డారు. సుగాలి ప్రీతి కేసులో పోలీసులు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో అన్ని రకాల పక్కా ఆధారాలు ఉన్నాయని, కానీ పవన్ కల్యాణ్ మాత్రం ఆధారాలు లేవని అనడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ కోర్టులో అత్యంత భద్రంగా ఉన్నాయని అన్నారు. ఆధారాలు లేవంటూ నిందితులను కేసు నుంచి తప్పించాలని పవన్ చూస్తున్నారా..? అంటూ సూటిగా ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ అజ్ఞానాన్ని చూసి జనసేన నేతలు, కార్యకర్తలు తరించాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## భువనగిరి కోటకు పర్యాటక హంగులు..
# రోప్‌వే, పార్కింగ్, హోటల్



**హైదరాబాద్, :** భువనగిరి కోట అభివృద్ధి పనులను అక్టోబర్ 2 లోగా పూర్తిచేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం కోట వద్ద పర్యటించిన ఆయన కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. రోప్‌వే, హోటల్, పార్కింగ్, మరుగుదొడ్లు, చిన్నారుల ఆటస్థలం, కోట పునరుద్ధరణ పనులు, కేఫ్, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ సహా పర్యాటక సదుపాయాలను పరిశీలించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనులు చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని జూపల్లి తెలిపారు. చారిత్రక వైభవాన్ని కాపాడుతూ భువనగిరి కోటను ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాకలను అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక -వారసత్వ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.56.81 కోట్లతో 'భువనగిరి ఫోర్ట్ ఎక్స్‌పీరియెన్షియల్ జోన్' ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.17.91 కోట్లతో 1,020 మీటర్ల పొడవైన రోప్‌వే నిర్మిస్తున్నారు. గంటకు 250 నుంచి 300 మంది ప్రయాణికులు వినియోగించుకునే సామర్థ్యంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన నిధులతో రహదారులు, పార్కింగ్, వీక్షణ గ్యాలరీ, కేఫ్, విద్యుదీకరణ, తాగునీటి సదుపాయాలు, సీసీ కెమెరాలు, భద్రతా వ్యవస్థలు, వారసత్వ కట్టడాల పునరుద్ధరణ వంటి పనులు చేపడుతున్నారు.

## రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షం..
### - ఆరెంజ్ అలర్ట్ జారీ



**హైదరాబాద్, :** రాగల మూడు గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో తేలికపాటి ఉరుములతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంటకు 41-61కి.మీ. గాలి వేగంతో కూడి మోస్తరు ఉరుములతో కూడి వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రిపోర్టు మధ్యాహ్నం నాలుగు గంటల వరకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఇక ఇవాళ ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోల అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నాడు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## ఏక్‌నాథ్ షిండే క్యాంపులో చేరిన ఆరు మంది సేన రెబల్ ఎంపీలు



ముంబై: అనుకున్నట్లే జరిగింది. ఉద్ధవ్ ఠాక్రే శివసేన వర్గానికి చెందిన ఆరు మంది ఎంపీలు ఏకనాథ్ షిండే వర్గానికి చెందిన శివసేన పార్టీలో చేరారు. ముంబైలో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఉద్ధవ్ టీమ్‌లో మొత్తం 9 మంది ఎంపీలు ఉండగా, దాంట్లో ఇప్పుడు ఆరు మంది ఎంపీలు షిండే వర్గంలో చేరారు. దీంతో ఊహాగానాలకు బ్రేక్ పడింది. ఏక్‌నాథ్ వర్గంలో చేరిన ఎంపీల్లో ఓమ్‌రాజే నింబాల్కర్(ధారాశివ్), సంజయ్ దినా పాటిల్(ముంబై నార్త్ ఈస్ట్), సంజయ్ జాదవ్(పర్భని), సంజయ్ దేశ్‌ముక్(యవత్మాల్-వాసిమ్), నగేశ్ పాటిల్ అస్తికర్(హింగోలి), బౌసాహెబ్ వక్‌చౌరే(షిర్డి) ఉన్నారు. రెబల్స్ ఎంపీలే షిండే వర్గంలో చేరడంలో సేన యూబీటీ సంఖ్య కేవలం మూడుకు పడిపోయింది. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తప్పుకునేందుకు రెబల్స్‌కు మూడో వంతు మెజారిటీ కూడా ఉన్నది. ఆరు పులులు ఇక్కడే ఉన్నాయని, వాళ్లు ఇప్పుడు రియల్ శివసేన ఫ్యామిలీలో కలిశారని, రియల్ శివసేన ఫ్యామిలీకి వెల్కమ్ చెబుతున్నానని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం షిండే తెలిపారు. శివసేన పార్టీని కాపాడుకునేందుకు గతంలో తాము రెబల్స్‌గా మారామని, ఇప్పుడు రెండో దశ ప్రారంభమైందన్నారు.

# అరణ్యరోదన



మన ప్రాచీనులు అడవులను దైవంగా ఆరాధించేవారు. అడవులను జీవజాలానికి ప్రాణాధారంగా చూసేవారు. అడవులను పవిత్ర తపోభూములుగా పరిగణించేవారు. అరణ్యాల ప్రస్తావన లేని పురాణేతిహాసాలేవీ మనకు లేవు. ఉద్యాన వర్ణన లేని ప్రబంధాలేవీ మనకు లేవు. అరణ్యకాండ లేని రామాయణాన్ని, అరణ్యపర్వం లేని మహాభారతాన్ని మనం ఊహించుకోలేం. ప్రాచీన వేదర్షులు సైతం వన ప్రాశస్త్యాన్ని ప్రస్తుతించారు. 'అంజనగంధిం సురభిం బహున్నామ కృషీవలామ్/ ప్రాహం మృగాణాం మాతరమరణ్యానిమశంసిషమ్' అని ఋగ్వేదంలోని 'అరణ్యాని సూక్తం' చెబుతోంది. అంటే, అంజనంలా సుగంధభరితమైనది, అనేక జంతువులకు తల్లివంటిది అయిన అరణ్యదేవతను స్తుతిస్తున్నాను అని అర్థం. 'దశకూప సమా వాపీ దశవాపీ సమో హ్రదః/ దశహ్రద సమః పుత్రో దశపుత్ర సమో ద్రుమః' అని 'పద్మపురాణం' చెబుతోంది. అంటే, పది బావులకు సమానం ఒక చెరువు, పది చెరువులకు సమానం ఒక సరస్సు, పది సరస్సులకు సమానం ఒక పుత్రుడు, పదిమంది పుత్రులకు సమానం ఒక వృక్షం అని అర్థం. 'అశ్వత్థమేకం పిచుమందమేకం న్యగ్రోధమేకం దశతింత్రిణీకం/ కపిత్థ బిల్వామలకత్రయాంచ పంచామ్రవాపీ నరకం న వశ్యేత్'-- రావిచెట్టు, వేపచెట్టు, మర్రిచెట్టు ఒక్కొక్కటి చొప్పున; పది చింతచెట్లు; మూడేసి వెలగచెట్లు, మారేడుచెట్లు, ఉసిరిచెట్లు; ఐదు మామిడిచెట్లు పెంచినవాడికి నరకం ఉండదు అని స్కాందపురాణం చెబుతోంది. వేద పురాణేతిహాసాలను గమనిస్తే, ప్రాచీనులు చెట్టు చేమలతో నిండిన అడవులకు ఎంతటి విలువనిచ్చేవారో అర్థమవుతుంది. ప్రాచీనకాలంలో రాజులు కూడా అడవుల సంరక్షణను బాధ్యతగా భావించేవారు. 'ద్రవ్యవనకర్మాంతాశ్చ ప్రయోజయేత్/ ద్రవ్యవనచ్ఛిదాం చ దండం కారయేత్' అని కౌటిల్యుడి అర్థశాస్త్రం చెబుతోంది. అంటే, అటవీ సంపదనకు సక్రమంగా వినియోగించాలి. అక్రమంగా అడవులను నరికివేసేవారిని శిక్షించాలి అని అర్థం. కౌటిల్యుడు 'అర్థశాస్త్రం'లో అభయవనాలు, హస్తివనాలు వంటి రకరకాల అడవుల సంరక్షణ కోసం పాటించవలసిన విధి విధానాలను వివరంగా చెప్పాడు. దాదాపు పదివేల ఏళ్ల కిందట-- నాగరికతలు మొదలైన కాలంలో భూమ్మీద దాదాపు అరవై శాతం అడవులే ఉండేవి. పద్దెనిమిదో శతాబ్దిలో పారిశ్రామిక విప్లవం మొదలయ్యేంత వరకు అడవుల పరిమాణం దాదాపు ఇదే స్థాయిలో ఉండేది. పారిశ్రామిక విప్లవం నాటి నుంచి అడవులు క్షీణించడం మొదలైంది. ఆధునికత, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ అడవుల విస్తీర్ణాన్ని కబళించడం మొదలైంది. ఇప్పుడు భూమ్మీద దాదాపు ముప్పయి శాతం అడవులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పారిశ్రామిక విప్లవం నాటి నుంచి నేటి వరకు భూమ్మీద ఉన్న అడవుల విస్తీర్ణం సగానికి సగం క్షీణించి పోయింది. ప్రస్తుత శతాబ్ది మొదలైన తొలి ఇరవై ఏళ్లలోనే ఏకంగా ఆరు శాతం మేరకు అడవులు తరిగిపోయాయి. మన దేశంలోనైతే, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు సగానికి సగం అడవులు అంతరించిపోయాయి. ఒకవైపు అడవుల విస్తీర్ణం తరిగిపోతుంటే, మరోవైపు మరుభూముల విస్తీర్ణం పెరుగుతోంది. గడచిన శతాబ్ద కాలంలో సహారా ఎడారి విస్తీర్ణం పది శాతం పెరిగింది. 'ఒక అడవిని సృష్టించడం కంటే ఒక ఎడారిని సృష్టించడం తేలిక కావడమే విచారకరం' అన్నాడు ఇంగ్లిష్ శాస్త్రవేత్త, పర్యావరణవేత్త జేమ్స్ లవ్‌లాక్. పనులు తేలిక చేసుకోవడానికి అలవాటుపడ్డ ఆధునికులు అడవులను సృష్టించే శ్రమ తీసుకోకుండా, తేలికగా ఎడారులను సృష్టించుకుంటున్నారు. అడవులు పుడమికి ఊపిరితిత్తులు. ఆధునిక మానవులు వాటికి తూట్లు పొడుస్తున్నారు. పర్యవసానంగా భూతాపం పెరిగి, మనుషులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మనుషులకు ఊపిరాడాలన్నా, సకాలంలో వానలు కురిసి పంటలు పండాలన్నా, ఇంకా ఈ భూమ్మీద మానవాళి మరిన్ని కాలాలపాటు మనుగడ సాగించాలన్నా, మనం ఇప్పటికైనా మేలుకొని అడవులను కాపాడుకోవాలి. అడవులన్నీ నశించాక మానవాళి చేసే ఆక్రందనలు అరణ్యరోదనలే అవుతాయి.

## నేరేడు విరగ కాస్తే కరువు తప్పదా?
## వాతావరణ మార్పులను ముందే పసిగట్టగలవా?

'ఈ ఏడాది నేరేడు చెట్లు అసాధారణంగా ఎక్కువ పండ్లు కాస్తున్నాయి. ఇది రాబోయే కరువుకు ప్రకృతి హెచ్చరిక' అని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వాదన వెనుక శాస్త్రం ఏమి చెప్తున్నది? పెద్దల అనుభవాలు, అమ్మమ్మల పరిశీలనలు, స్ట్రెస్ ఫ్రూటింగ్, మాస్టింగ్ వంటి శాస్త్రీయ పదాలు కూడా జోడించటంతో ఇది మరింత నమ్మదగినట్టుగా కనిపిస్తున్నది. అయితే నిజంగా నేరేడు చెట్లు విరగకాస్తే కరువు వస్తుందా? చెట్లు భవిష్యత్తులో వచ్చే వాతావరణ మార్పులను ముందే పసిగట్టగలవా? నేరేడు చెట్లు ఈ ఏడాది నిజంగానే ఎక్కువ పండ్లు కాస్తున్నాయా? తెలంగాణ లోని కొన్ని ప్రాంతాల్లో రైతులు, గ్రామీణ ప్రజలు ఈసారి నేరేడు చెట్లపై పండ్లు సాధారణం కంటే ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్తున్నారు. ఇది పూర్తిగా కల్పితం కాదు. కానీ ఒక ప్రాంతంలో లేదా కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువ పండ్లు కనిపించటం ద్వారా దేశవ్యాప్తంగా కరువు వస్తుందని చెప్పటం శాస్త్రీయంగా సరైన నిర్ధారణ కాదు. ప్రతి సంవత్సరం చెట్లలో పుష్పించటం, పండ్లు కాయటం అనేవి వర్షపాతం, ఉష్ణోగ్రతలు, నేలలో సారం, తేమ, చెట్టు ఆరోగ్యస్థితి, పరాగసంపర్కం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'మాస్టింగ్' అనే పదం నిజంగానే వృక్షశాస్త్రంలో ఉన్నది. కొన్ని వృక్షజాతులు ప్రతి సంవత్సరం సమానంగా పండ్లు ఇవ్వవు. కొన్నేండ్లు తక్కువగా, మరికొన్నేండ్లు భారీగా ఉత్పత్తి చేస్తాయి. దీనినే 'మాస్టింగ్' అంటారు. ఓక్, పైన్, పనస, అనాస వంటి అనేక అడవి చెట్లలో ఈ లక్షణం కనిపిస్తుంది. దీనివల్ల కలిగే ప్రయోజనం ఏమిటంటే...ఒకేసారి భారీ సంఖ్యలో విత్తనాలు ఉత్పత్తి చేస్తే వాటిని పక్షులు, జంతువులు మొత్తం తినలేవు. ఫలితంగా కొన్ని విత్తనాలు నేలలో పడిపోయి కొత్త మొక్కలుగా ఎదుగుతాయి. అంటే 'మాస్టింగ్' అనేది ప్రకృతిలో జాతి మనుగడ కోసం ఏర్పడిన ఒక వ్యూహం. నిరుడు తూర్పుకనుమల్లో మేం తిరుగుతున్నపుడు చెట్లకు పనస పండ్లు విపరీతంగా వేలాడుతూ కొన్ని కుప్పలుగా నేలమీద రాలిపోవటం చూశాం. అలాగే పైనాపిల్ కూడా. 'ఈ కొండ ప్రాంతాల్లో ఊట నీటి వల్ల ఈ పండ్లు బాగా పండుతాయి. ఇలా పండటం వల్ల కరువు ఎపుడూ రాలేదు' అని అక్కడి రైతులు చెప్పారు. కొన్ని మొక్కలు లేదా చెట్లు



తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు ఎక్కువ పూలు లేదా పండ్లు ఉత్పత్తి చేస్తుంటాయి. నీటి కొరత, అధిక ఉష్ణోగ్రతలు, చీడలు, వేర్లకు నష్టం వంటి పరిస్థితుల్లో కొన్ని మొక్కలు తమ జీవచక్రాన్ని వేగవంతం చేసి విత్తనాలను ఉత్పత్తి చేయటానికి ప్రయత్నిస్తాయి. భారతదేశంలో అత్యంత సహనశక్తి కలిగిన చెట్లలో నేరేడు ఒకటి. లోతైన వేర్లు ఉంటాయి. ఎండలను తట్టుకుంటుంది. తక్కువ నీటితో కూడా బతుకుతుంది. భూగర్భ జలాలను లోతుగా అందుకోగలదు. అందుకే నేరేడుచెట్టు పండ్లు ఎక్కువగా కాయటం అనేది తప్పనిసరిగా కరువు సంకేతం అని చెప్పలేం. ఈ ఏడాది ఎక్కువ పండ్లు ఎందుకు కనిపిస్తున్నాయి? దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. చెట్టు గత సంవత్సరం నిల్వ చేసుకున్న శక్తిని ఈ ఏడాది పండ్ల రూపంలో వినియోగించి ఉండవచ్చు. కొన్ని చెట్లలో పుష్పోత్పత్తిని వేడి ప్రభావితం చేస్తుంది. కొన్నేండ్లకు ఒకసారి సహజంగానే భారీగా పండ్లు కాస్తుంటాయి. ఒక గ్రామంలో కనిపించిన పరిస్థితి రాష్ట్రమంతటా వర్తించకపోవచ్చు. నేరేడు చెట్లు ఎక్కువ పండ్లు కాస్తే కరువు వస్తుందనే వాదనకు ప్రత్యక్ష శాస్త్రీయ ఆధారాలు లేవు. అయితే, చెట్లు నీటి ఒత్తిడికి స్పందిస్తాయి. మాస్టింగ్, స్ట్రెస్ ఫ్రూటింగ్ వంటి ప్రక్రియలు నిజంగానే ఉన్నాయి. నేరేడు చెట్లు ఒక ముఖ్యమైన సందేశం మాత్రం ఇస్తాయి. అది ప్రకృతిలో జరుగుతున్న మార్పులను గమనించమని సూచిస్తాయి. భారత్‌లో వాతావరణ మార్పు ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎండలు పెరుగుతున్నాయి. భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. వర్షాలు అస్థిరంగా మారుతున్నాయి. ఇలాంటి సమయంలో నేరేడు చెట్లు ఎక్కువ పండ్లు పండాయా? లేదా? అనేది కాదు, నీటిని ఎలా వినియోగిస్తున్నాం? భూగర్భ జలాలను ఎంత వేగంగా ఖాళీ చేస్తున్నాం? చెట్లను ఎంత మేరకు కాపాడుతున్నాం? అనేదే అసలు ప్రశ్న. ప్రకృతి సంకేతాలను గౌరవించాలి. కానీ వాటిని మూఢనమ్మకాలుగా కాకుండా శాస్త్రీయ అవగాహనతో అర్థం చేసుకోవాలి. అప్పుడే సంప్రదాయ జ్ఞానం, ఆధునిక శాస్త్రం కలిసి మన భవిష్యత్తును కాపాడుతాయి.

# 'గుర్తింపు' గండం!

### డోలాయమానంలో 5 లక్షల ఇంటర్ విద్యార్థులు
### అనుబంధ గుర్తింపు లేకున్నా.. ప్రైవేటు కాలేజీల్లో జోరుగా ప్రవేశాలు
### మే నెలాఖరుతోనే ముగిసిన అఫ్లియేషన్ల గడువు
### తనిఖీల నివేదికలు ఇచ్చామంటున్న జిల్లా అధికారులు
### బోర్డు బృందాలు మళ్లీ తనిఖీ చేయాల్సిందేనంటున్న కార్యదర్శి
### ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5 లక్షల మంది ఇంటర్ విద్యార్థుల భవిష్యత్ గాలిలో ఊగిసలాడుతోంది. కాలేజీల్లో చేరినా వాటికి గుర్తింపు ఉందా? లేదా? అన్న డోలాయమానంలో పడిపోయారు. అన్ని జిల్లాల్లో ఈ అయోమయం నెలకొన్నా ఇంటర్మీడియెట్ బోర్డు ఏమాత్రం చలించడం లేదు. తెలంగాణ వ్యాప్తంగా 3,400 జూనియర్ కాలేజీలున్నాయి. ప్రైవేటు రంగంలో 1400. ప్రభుత్వ రంగంలో ఉన్న 800 కాలేజీలకు బోర్డు అనుబంధ గుర్తింపు ఇచ్చింది. ప్రైవేటు రంగంలో ఉన్న వాటిల్లో కేవలం 209కి మాత్రమే బోర్డు గుర్తింపు వచ్చింది. వెయ్యికి పైగా కాలేజీలకు అఫ్లియేషన్ ఎందుకు ఆపారో బోర్డు అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే 'చూస్తాం... ఇస్తాం... చేస్తాం...' అంటూ దాటవేస్తున్నారు. అనుబంధ గుర్తింపును ఏప్రిల్ నాటికే పూర్తి చేస్తామని గతంలో అధికారులు చెప్పారు. ఇంటర్ షెడ్యూల్ ప్రకారం చూసినా మే నెలాఖరుకే గుర్తింపు ఇవ్వాలి. ప్రైవేటు కాలేజీలను తనిఖీలు చేసి, నివేదికలను బోర్డుకు పంపామని జిల్లా అధికారులు కూడా చెబుతున్నారు. ప్రైవేటువే కాదు కొన్ని మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, సంక్షేమ గురుకులాలకు కూడా బోర్డు అనుమతివ్వలేదు.

వాటిని ధ్రువీకరించేదెవరు?

ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా కాలేజీలు అవసరమైన ధ్రువపత్రాలన్నీ సమర్పించాయి. అగ్నిమాపకశాఖ, శానిటేషన్, ట్రాఫిక్, భవన పటిష్టత వంటి పత్రాలను బోర్డుకు ఇచ్చాయి. వీటన్నింటినీ అధికారులు స్వయంగా పరిశీలించాలని ఇంటర్ కార్యదర్శి భావిస్తున్నట్టు తెలిసింది. క్షేత్రస్థాయి అధికారులు కాలేజీలతో కుమ్మక్కై వాటిని ధ్రువీకరించారనేది కార్యదర్శి అనుమానం. వాస్తవానికి బహుళ అంతస్తుల భవనాల్లో నడిచే కాలేజీలకు అగ్నిమాపక శాఖ ఎప్పట్నుంచో అనుమతి ఇవ్వొద్దని చెబుతోంది. పరీక్షలు దగ్గరపడే వరకూ అనుమతులూ ఇవ్వడం లేదు. ఆఖర్లో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అఫ్లియేషన్ ఇస్తున్నట్టు చెబుతున్నాయి.

అఫ్లియేషన్ లేకున్నా అడ్మిషన్లు

అనుబంధ గుర్తింపు లేకున్నా అన్ని కాలేజీలూ పెద్దఎత్తున విద్యార్థులను చేర్చుకున్నాయి. రూ. 80వేల నుంచి రూ. 4 లక్షల వరకూ వార్షిక ఫీజు దండుకున్నాయి. జూన్ 1 నుంచే క్లాసులు మొదలు పెట్టాయి. అయినా అధికారులు గుర్తింపులేని కాలేజీలను అడ్డుకునే సాహసం చేయడం లేదు. గుర్తింపు లేని కాలేజీల్లో ఇప్పటికే ఐదు లక్షల మంది చేరారు. గుర్తింపు ఉంటే తప్ప వీళ్లు వార్షిక పరీక్షలు రాసే అవకాశం ఉండదు. లేదంటే ప్రైవేటుగా పరీక్షలు రాయాలి. ఇంకోవైపు కార్పొరేట్ కాలేజీల మాయాజాలం యథాతథంగా సాగుతోంది. గుర్తింపు ఉన్న బ్రాంచీల్లో విద్యార్థుల ప్రవేశాలు చూపిస్తున్నారు. ఉదాహరణకు హైదరాబాద్ బ్రాంచీలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య నిండినా చేర్చుకుంటున్నారు. వారి ప్రవేశాలను వరంగల్, ఖమ్మం లేదా ఆదిలాబాద్ బ్రాంచీల్లో చూపిస్తున్నారు. అక్కడ ప్రవేశాలు లేకపోవడమే వారికి కలిసి వస్తోంది. పెద్ద కాలేజీలు ఇంత బాహాటంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని అధికారులు తమకు మాత్రం అఫ్లియేషన్లు ఇవ్వకుండా వేధించడం ఏమిటని కొన్ని కాలేజీల నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇంటర్ అధికారుల వివరణ కోరేందుకు యత్నించగా వారు స్పందించలేదు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.